



వైసీపీ నేత ఆక్రమించి చదును చేసిన మల్లమ్మకుంట స్థలం

కబ్జారాయుళ్లలో కలవరం

● బద్వేలు భూ కబ్జాలపై.. త్వరలో విచారణ కమిటీ ● అధికారుల వద్ద వైసీపీ నేతల ఆక్రమణల చిట్టా
● భూ ఆక్రమణ కేసులో ఇప్పటికే ఒక నేత అరెస్టు ● వెలుగులోకి రానున్న మరో నేత ఆక్రమణలు..?

బద్వేలు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బద్వేలు నియోజకవర్గంలో వైసీపీ నేతల భూకబ్జాల పర్వం బయటకు తీస్తామని టీడీపీ నేతలు ఎన్నికలకు ముందు చెప్పినట్లుగానే అడుగులు వేస్తున్నారు. పట్టణంతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా ఆక్రమణల చిట్టా సిద్ధం చేసిన టీడీపీ ముఖ్య నేతలు ఇప్పటికే దానిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో కొద్దిరోజుల్లోనే వీటిపై నిగ్గుతేల్చేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారని తెలుస్తోంది. ఇందుకోసం ఓ కమిటీని ఏర్పాటు చేసి దాని ద్వారా నియోజకవర్గ వ్యాప్తంగా వైసీపీ నేతల భూ ఆక్రమణలు బయటకు తీసే అవకాశం ఉండడంతో.. భూ కబ్జాలకు పాల్పడి నకిలీ పత్రాలు సృష్టించిన వారిలో గుబులు రేగుతోంది. రికార్డుల ట్యాంపరింగ్ ద్వారా భూ ఆక్రమణలకు పాల్పడిన బద్వేలు మున్సిపల్ వైస్ చైర్మన్ గోపాలస్వామిపై ఇప్పటికే కేసు నమోదు చేసి బుధవారం అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఈ తరుణంలో దాదాపు 60 ఎకరాల ఆక్రమణలకు పాల్పడ్డ మరో వైసీపీ నేత వ్యవహారంపై అధికారులు దృష్టిపెట్టినట్లు సమాచారం.

వేల ఎకరాలు అన్యాక్రాంతం

బద్వేలు నియోజకవర్గంలో వేల ఎకరాల ప్రభుత్వ భూములను ఇష్టారాజ్యంగా ఆక్రమించారు. వీరిలో వైసీపీకి చెందిన చోటా, మోటా నుంచి ఓ మోస్తరు నేతలు కూడా ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఎన్నికలకు ముందు ప్రచార సమయంలో తాము అధికారంలోకి రాగానే వైసీపీ భూ ఆక్రమణలను వెలికితీస్తామని టీడీపీ నేతలు హెచ్చరించారు. ఈ మేరకు యువగళం పాదయాత్ర సమయంలో నారా లోకేశ్ లోకేశ్ సైతం బద్వేలు భూకబ్జాలపై ప్రత్యేక కమిటీ వేసి నిగ్గుతేలుస్తామని హామీ ఇచ్చారు. బద్వేలు నియోజకవర్గంలో సుమారు 20 వేల ఎకరాలకు పైగా భూములు అన్యాక్రాంతమయ్యాయని తెలుస్తోంది. వైసీపీ నేతల ఆక్రమణలకు అప్పటి అధికారులు, ఉద్యోగులు కూడా సహకరించారని ఆరోపణలు వచ్చాయి. ప్రభుత్వ భూములే కాదు.. పట్టణంలో ఇళ్లస్థలాలకు నకిలీ పట్టాలు సృష్టించి పెద్ద ఎత్తున ఆక్రమించుకోవడంతో పలుమార్లు వివాదాలు చోటుచేసుకున్నాయి.

మచ్చుకు కొన్ని ఆక్రమణలు..

● బద్వేలు పట్టణానికి చెందిన ఓ వైసీపీ నేత వితంతురాలు లక్ష్మీదేవికి చెందిన చెన్నంపల్లె పొలంలో 1769/2 సర్వేనెంబరులో 437 నెంబరుతో ఉన్న నివాస స్థలాన్ని కబ్జా చేశారు.

● 1538 సర్వేనెంబరు చెన్నంపల్లె పొలంలో ఓ వైసీపీ నేత 85సెంట్లు ఆక్రమించారు.

● 1754/2 సర్వేనెంబరులో 5.9 ఎకరాలు వైసీపీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి కబ్జాచేశారు.

● బి.కోడూరు మండలం, మేకవారిపల్లెలో 575 సర్వేనెంబరులో దాదాపు 440 ఎకరాలు కబ్జా చేశారు.

● కాశినాయన మండలంలోని 128, 129, 130 సర్వేనెంబర్లలో కొండపోరంబోకు భూములను దర్జాగా ఆక్రమించుకున్నారు.

● పోరుమామిళ్ల మండలం కలవకుంట్ల పంచాయతీ పరిధిలోని సర్వేనెంబరు 102లోని మల్లమ్మకుంట చెరువులో 53ఎకరాలు వైసీపీ నేత ఆక్రమించారు.

● గోపవరం మండలం, మడకల వారిపల్లె పరిధిలో 813 సర్వేనెంబరులో ఒక ఎకరా భూమి వైసీపీ నేత ఆక్రమించారు.

● బద్వేలు మండలం, పుట్టాయపల్లెలో 38 సర్వేనెంబరులో 20 ఎకరాలు, 33 సర్వేనెంబరులో 2 ఎకరాలు, 39లో నాలుగెకరాలు, 77లో 17 ఎకరాలు దాదాపు 50 ఎకరాల భూమిని వైసీపీ నేతలు ఆక్రమించారు.

● అట్లూరు మండలం నల్లాయపల్లెలోని 40 సర్వేనెంబరులో 120 ఎకరాలు వైసీపీ నేతలు ఆక్రమించారు.

● వెంకటాపురంలోని 22, 24 సర్వేనెంబర్లలో వైసీపీ నేతలు దాదాపు 100 ఎకరాలకు పైగా ఆక్రమించారు.

● 424 సర్వేనెంబరులో 20 ఎకరాలు వైసీపీ నేతలు ఆక్రమించారు. ఇలా అధికారాన్ని అడ్డుపెట్టుకుని వైసీపీ నేతలు వేలాది ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో భూ ఆక్రమణలపై విచారణ చేపడుతుండడం, ఇప్పటికే బద్వేలు మున్సిపల్ వైస్‌చైర్మన్‌ను అరెస్టు చేయడంతో.. వైసీపీ నేతల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.



ఆటోగంగమ్మ వివరాలు సేకరిస్తున్న డీఆర్డీయే ఏపీఎం రాధిక



ఆటోకు డ్వాక్రా రుణం ఇస్తాం

● డీఆర్డీయే ఏపీఎం రాధిక

కొండాపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గండ్లూరు ఎస్టీ కాలనీ వాసి ఆటో గంగమ్మకు ఆటో కొనుక్కునేందుకు రుణం ఇస్తామని డీఆర్డీయే ఏపీఎం రాధిక తెలిపారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'బతుకు భారమై ఆటోనడుపుతూ' కథనంపై విశేష స్పందన లభిస్తోంది. త్వరలో గంగమ్మను కలుస్తానని మంత్రి నారా లోకేశ్ ట్వీట్ చేయడంతో అధికారులు మరింత అలర్ట్ అయ్యారు. సెర్ప్ అధికారుల ఆదేశాలతో ఏపీఎం రాధిక గురువారం గండ్లూరు ఎస్టీ కాలనీలోని గంగమ్మ ఇంటికి వచ్చారు. ఆటో కొనుక్కోవడానికి డౌన్‌పేమెంట్ 10 శాతం చెల్లించాల్సి ఉండగా గంగమ్మ గిరిజన మహిళ కాబట్టి 5 శాతం డౌన్‌పేమెంట్ చెల్లిస్తే రుణం మంజూరు చేయిస్తామని ఏపీఎం తెలిపారు. వడ్డీ లేకుండా కంతుల వారీగా ఆటోకు రుణం చెల్లించాల్సి ఉంటుందన్నారు. కంతు నెలకు సుమారు రూ.5000 కట్టాల్సి వస్తుందని అయితే తనకు ఆటో ద్వారా అంత సంపాదన లేదని గంగమ్మ ఏపీఎంకు వివరించారు. తాము తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నామని ప్రభుత్వం ఉచితంగా ఆటో ఇవ్వాలని గంగమ్మ విన్నవించారు. ఒకవేళ వీలుకాకపోతే సబ్సిడీ ద్వారా అయినా ఇవ్వాలని గంగమ్మ కోరారు.



జడ్జి బంగ్లాలో శ్రీగంధం చెట్ల నరికివేత

వివరాలు..6లో

పీటీ వారెంట్‌పై కడప కోర్టుకు వర్రా

● విచారణ 23కు వాయిదా

కడప రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విశాఖ సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న వైసీపీ సోషల్ మీడియా జిల్లా కోకన్వీనర్ వర్రా రవీందర్‌రెడ్డిని పోలీసులు పీటీ వారెంట్‌పై తీసుకొచ్చి గురువారం ఎస్సీ, ఎస్టీ కోర్టు(జిల్లా నాల్గవ అదనపు కోర్టు)లో హాజరుపరిచారు. సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టిన వ్యవహారంలో రాజంపేట మన్నూరు పోలీస్ స్టేషన్‌లో ఈయనపై కేసు నమోదైంది. దీనికి సంబంధించి పోలీసులు వర్రాను తీసుకొచ్చి జిల్లా నాల్గవ అదనపు కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి వెంకటేశ్వరరావు ఎదుట హాజరుపరచగా తదుపరి విచారణను 23వ తేదీకి వాయిదా వేశారు.

కందుల కొనుగోళ్లకు అనుమతి : జేసీ

కడప కలెక్టరేట్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏపీ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో జిల్లాలో కందులు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ సరుకును ప్రభుత్వానికి విక్రయించాలనుకునే రైతులు ముందుగా వారికి సంబంధించిన ఆర్‌ఎస్‌కేలలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ-క్రాప్ నమోదయిన రైతుల నుంచి మాత్రమే కొనుగోలు చేస్తారని పేర్కొన్నారు. ప్రతి రైతు తమ పంటలకు ఈ-క్రాప్ చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని జిల్లాలో కందిపంట సాగు చేసిన రైతులు సద్వినియోగం చేసుకోవాలని జేసీ కోరారు.

మదనపల్లె ఫైల్స్ దహనం కేసులో సీఐడీ విచారణ



తరిగొండలో రైతులను విచారిస్తున్న నెల్లూరు సీఐడీ సీఐ రాజేష్‌కుమార్

గుర్రంకొండ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయం ఫైల్స్ దహనం కేసు విషయమై గురువారం నెల్లూరు సీఐడీ సీఐ రాజేష్‌కుమార్ బృందం రైతులను విచారించారు. ఇందులో భాగంగా శెట్టివారిపల్లె, తరిగొండ గ్రామాలకు చెందిన 20 మంది రైతులను విచారించారు. ఈ రైతుల భూములను ఓ మోతుబరి తన పేరిట ఆన్‌లైన్, వన్‌బీ నమూనాలను చేయించుకున్నాడు. ఈ క్రమంలో రైతుల నుంచి భూములను కొనుగోలు చేశాడా..?లేక దౌర్జన్యంగా భూములను లాక్కున్నాడా అనే కోణంలో వివరాలు సేకరించారు. అనంతరం రైతుల నుంచి భూములకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. రైతులు అందించిన వివరాలను ఉన్నతాధికారులకు అందచేస్తామని సీఐడీ అధికారులు తెలిపారు.

కడప నగర అభివృద్ధే ఏకైక లక్ష్యం

● టీడీపీలోకి ఏడుగురు వైసీపీ కార్పొరేటర్లు ● పార్టీ కండువా వేసి ఆహ్వానించిన ఎమ్మెల్యే



వైసీపీ కార్పొరేటర్లకు పార్టీ కండువా వేసి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మాధవి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కడప నగర అభివృద్ధే తమ ఏకైక లక్ష్యమని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆర్.మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం కడప నగరం ద్వారకానగర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో ఏడుగురు వైసీపీ కార్పొరేటర్లకు టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో మార్పు ప్రారంభమైందన్నారు. అభివృద్ధి కోరుకునే ప్రతి ఒక్కరినీ పార్టీలకతీతగా టీడీపీలోకి ఆహ్వానిస్తామన్నారు. ఈ నేపథ్యంలోనే వైసీపీకి చెందిన ఏడుగురు కార్పొరేటర్లు నగర అభివృద్ధిని కోరుకుంటూ టీడీపీలో చేరారన్నారు. కడప నగరాన్ని ఇతర నగరాలకు దీటుగా అభివృద్ధి చేస్తామని చంద్రబాబు కూడా హామీ ఇచ్చారన్నారు. రాష్ట్రంలో జరిగిన నీటి సంఘాల ఎన్నికల్లో టీడీపీ క్లీన్ స్వీప్ చేసిందన్నారు. ఇది ఊహించి భయంతోనే ప్రతిపక్ష నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలను బాయ్‌కాట్ చేస్తున్నట్లు ప్రకటించారన్నారు. ఒక్క చాన్స్ అని అధికారంలోకి వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని లూటీ చేశారన్నారు. ఇది తెలుసుకున్న ప్రజలు వైసీపీ ప్రభుత్వానికి చరమగీతం పాడారని తెలిపారు. రాబోయే రోజుల్లో వైసీపీ కనుమరుగు కాక తప్పదన్నారు. కాగా వైసీపీ కార్పొరేటర్లు 2వ డివిజన్ ఎం.సుబ్బారెడ్డి, 3వ డివిజన్ ఎ.మానస, 6వ డివిజన్ ఇ.నాగేంద్ర, 8వ డివిజన్ ఎ.లక్ష్మీదేవి, 32వ డివిజన్ ఎస్.బి.జఫుల్లా, 42వ డివిజన్ సి.స్వప్న, 50వ డివిజన్ కె.అరుణప్రభ టీడీపీలో చేరారు. గతంలో టీడీపీలో చేరిన 25వ డివిజన్ కార్పొరేటర్ కె.సూర్యనారాయణరావు కూడా వీరితో పాటు ఉన్నారు. వీరందరూ ఇటీవల అమరావతిలో చంద్రబాబును కలిసి వచ్చారు. కార్పొరేటర్లు పార్టీలో చేరిన అనంతరం.. కడప కార్పొరేషన్ పరిధిలోని నాలుగు సాగునీటి సంఘాలను ఇటీవల ఏకగ్రీవంగా కైవసం చేసుకున్న టీడీపీ మద్దతుదారులను ఎమ్మెల్యే టీడీపీ జిల్లా అధ్యక్షుడు సత్కరించారు.

'సహకార' ఎన్నికలు ఇప్పట్లో లేనట్టే?


● పర్సన్ ఇన్‌చార్జ్‌ల గడువు ఆరు నెలలు పొడిగింపు

● ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

కలికిరి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాలకు ఎన్నికలు సమీప కాలంలో జరిగే అవకాశాలు లేనట్లేనని గురువారం ప్రభుత్వం విడుదల చేసిన జీవో ద్వారా తెలుస్తోంది. అంతేగాకుండా నామినేటెడ్ పాలకవర్గాల నియామకాలు కూడా వాయిదా పడ్డట్టేనని చెబుతున్నారు. అన్ని రకాల సహకార సంఘాలకు ప్రస్తుతం అధికారులతో పర్సన్ ఇన్‌చార్జ్‌లను నియమించారు. ఈ పర్సన్ ఇన్‌చార్జ్‌ల గడువును మరో ఆరు నెలలు పొడిగిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా ఉన్న అధికారుల పదవీ కాలాన్ని ఈనెల 21వ తేదీ నుంచి మరో ఆరు నెలలపాటు పొడిగించారు. ప్రాథమిక సహకార సంఘాలు (పీఏసీఎస్)తో పాటు, రైతు సేవా సహకార సంఘాలు (ఫార్మర్స్ సర్వీసు కో-ఆపరేటివ్ సొసైటీస్), జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు, జిల్లా మార్కెటింగ్ సొసైటీలు, ప్రింటింగ్ ప్రెస్, వినియోగదారుల సహకార సంఘాలు లాంటి లార్జ్‌డ్ సైజ్ కో-ఆపరేటివ్ సొసైటీలన్నింటికీ ఈ పొడిగింపు ఉత్తర్వులు వర్తిస్తాయని ప్రభుత్వం పేర్కొంది. వివిధ రకాల సహకార సంఘాలకు త్వరలో ఎన్నికలు జరగనున్నట్లు ప్రచారం జరిగింది. లేదంటే గతంలో వలే ముగ్గురు సభ్యులతో కూడిన త్రీమెన్ కమిటీలను నామినేట్ చేయడానికి మరో వైపు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లుగా కూడా ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో జిల్లాలో దిగువస్థాయి అధికార పార్టీ శ్రేణులు త్రీమెన్ కమిటీల ద్వారా నామినేట్ కావడానికి ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఒకవేళ నామినేటెడ్ త్రీమెన్ కమిటీలు కాకుండా సహకార సంఘాలకు నేరుగా ఎన్నికలు జరిపినా ఎదుర్కొనేందుకు కూడా కూటమి పార్టీల నాయకులు సిద్ధంగా ఉన్నారని చెబుతున్నారు. ఈ దశలో అధికారులను పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా మరో ఆరు నెలలపాటు కొనసాగించేందుకు ప్రభుత్వం నిర్ణయించడంతో రాజకీయ వర్గాల్లో పలు రకాల చర్చలు జరుగుతున్నాయి.







ఊరిస్తున్న మార్కెట్ కమిటీలు

● సగం పోస్టులు బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ● మొత్తం పదవుల్లో మహిళలకు 50 శాతం
● జిల్లా యూనిట్‌గా రిజర్వేషన్లు ఖరారు..? ● పాలక వర్గాలకోసం కసరత్తు ● కూటమి పార్టీల్లో ఆశావహుల పైరవీలు

కడప రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): టీడీపీ సారథ్యంలోని కూటమి ప్రభుత్వం విడతల వారీగా నామినేటెడ్ పోస్టుల్ని భర్తీ చేస్తోంది. ఈ క్రమంలోనే మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలను నియమించేందుకు కసరత్తు చేస్తోంది. ఆయా కమిటీలకు చైర్మన్లతో పాటు వైస్ చైర్మన్లు, డైరెక్టర్ల నియామకాన్ని ప్రారంభించింది. ఈ మేరకు రిజర్వేషన్లు ఖరారు చేయాలంటూ ప్రభుత్వం కలెక్టర్లకు ఆదేశాలను జారీచేసింది. దీంతో మార్కెటింగ్‌శాఖ అధికారులు జిల్లాలో ఎన్ని మార్కెట్ కమిటీలున్నాయి.. 2022 ఆగస్టులో ఏ యార్డు ఏ కేటగిరికి రిజర్వేషన్ చేశారు తదితర వివరాలతో కలెక్టర్‌కు నివేదికను అందజేశారు. వీటిని కలెక్టర్ పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వ ఆదేశాల మేరకు జనరల్, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, మహిళలు ఇలా అన్ని వర్గాలు ఉండేలా జిల్లా యూనిట్‌గా రూల్ ఆఫ్ రిజర్వేషన్లను ఖరారు చేసినట్లు సమాచారం. దీంతో కూటమి నేతల్లో నామినేటెడ్ పదవుల పందేరం జోరందుకుంది. ఆశావహులంతా ఆయా ఎమ్మెల్యేలను, ముఖ్యనేతలను కలిసి పదవుల కోసం ముమ్మర ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఎన్నికలో సమయంలో కూటమి నేతల గెలుపుకోసం కృషి చేసిన వారంతా ఇప్పుడు నామినేటెడ్ పదవులు ఆశిస్తున్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీల చైర్మన్ పదవులకు రూల్ ఆఫ్ రిజర్వేషన్(ఆర్వోఆర్) అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు జిల్లా యూనిట్‌గా చైర్మన్ పదవులను 50 శాతం రిజర్వుడు వర్గాలకు కేటాయించనున్నారు. మొత్తంగా మహిళలకు 50 శాతం పదవులు దక్కనున్నాయి. బీసీలకు 29 శాతం, ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 6 శాతం పదవులు ఇవ్వనున్నారు. రైతుల ద్వారా ఎంపికైన డైరెక్టర్ల నుంచి చైర్మన్, వైస్ చైర్మన్‌లను ప్రభుత్వం నామినేట్ చేయనుంది. నియోజక వర్గ ఎమ్మెల్యే గౌరవ చైర్మన్‌గా ఉంటారు. డైరెక్టర్లు, చైర్మన్ పోస్టులను ఏ కేటగిరికి రిజర్వేషన్ కల్పిస్తారో ఆ కేటగిరి రైతుల నుంచే ఎంపిక చేయాల్సి ఉంటుంది. రైతుల కోటా డైరెక్టర్‌గా ఎంపిక కావాలంటే ఆ మార్కెట్ పరిధిలో సొంతంగా సాగుభూమి ఉండాలి. పాడిపరిశ్రమ రైతులు కూడా అర్హులే అయినప్పటికి పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి ధ్రువీకరణ పత్రం ఇవ్వాల్సి ఉంటుంది. ట్రేడర్స్ కోటాలో ఎంపికయ్యే డైరెక్టర్లు ఆ మార్కెట్‌లో ట్రేడింగ్ లైసెన్సు కలిగి ఉండాలి.

10 మార్కెట్ యార్డులకు..

వైసీపీ ప్రభుత్వ హయాంలో 2022 ఆగస్టులో ఉమ్మడి జిల్లాలోని 14 మార్కెట్ యార్డు కమిటీలకు పాలకవర్గాలను నియమించింది. ఈ ఏడాది జూన్‌లో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ పాలక వర్గాలను రద్దుచేసింది. తాజాగా నూతన పాలకవర్గాల నియామకానికి చర్యలు చేపట్టింది. ప్రస్తుత కడప జిల్లాలో 10 మార్కెట్ యార్డు కమిటీలు ఉన్నాయి. వీటిలో కడప, ప్రొద్దుటూరు, బద్వేలు, మైదుకూరు, జమ్మలమడుగు, కమలాపురం, పులివెందుల, సిద్దవటం, సింహాద్రిపురం, యర్రగుంట్లలో ఉన్నాయి.

● కడప మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని 2022లో బీసీ మహిళకు కేటాయించారు. ఈ సారి ఓసీ జనరల్‌కు వస్తుందని భావించి ఆ క్యాటగిరి నాయకులు చైర్మన్ పదవికోసం తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నారు. వీరిలో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ఓ నాయకుడు స్థానిక ఎమ్మెల్యే నుంచి ఓకే అనిపించుకున్నట్లు ప్రచారం సాగుతోంది.

● సిద్దవటం మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఇదివరకు ఎస్సీ మహిళకు కేటాయించడంతో ఈ సారి ఇతర సామాజిక వర్గాలకు అవకాశం రానుందని ప్రచారం సాగుతోంది. దీంతో ఓసీ, బీసీ వర్గాలకు చెందిన వారు చైర్మన్ పదవికోసం ప్రయత్నాలు సాగిస్తున్నారు.

● బద్వేలు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఇదివరకు బీసీ మహిళకు కేటాయించారు. ఈసారి ఇతర సామాజిక వర్గాలకు అవకాశాలు ఉండడంతో ప్రయత్నాలు సాగిస్తున్నారు. బద్వేలు ఎమ్మెల్యే స్థానానికి బీజేపీ తరఫున పోటీ చేయడంతో ఇక్కడ ఆ పార్టీ నాయకులకే ఎక్కువ అవకాశాలు ఉంటాయని ప్రచారం సాగుతోంది.

● ప్రొద్దుటూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఇదివరకు ఓసీ మహిళకు కేటాయించారు. ఈ సారి ఇతరులకు కేటాయించనున్నారు.

● యర్రగుంట్ల మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఇదివరకు బీసీ మహిళకు కేటాయించారు. ఈ సారి ఇతర సామాజిక వర్గాలకు కేటాయించనున్నారు.

● జమ్మలమడుగు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఇదివరకు ఓసీ జనరల్‌కు కేటాయించారు. ఈ సారి ఇతరులకు కేటాయించనున్నారు. అయితే యర్రగుంట్ల, జమ్మలమడుగు మార్కెట్ యార్డు కమిటీలు కూటమి పార్టీ బీజేపీ ఎమ్మెల్యే పరిధిలో ఉండడంతో ఈ స్థానాలు ఆ పార్టీ నాయకులకే చెందే అవకాశాలు ఉన్నాయి.

● అలాగే కమలాపురం మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇదివరకు ఓసీకి కేటాయించడంతో ఈ సారి బీసీ, ఎస్సీ సామాజిక వర్గాల వారు ప్రయత్నాలు చేస్తున్నారు. టీడీపీ పెద్దల ఆశీర్వాదం కోసం పోటీ పడుతున్నారు.

● పులివెందుల మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఇదివరకు ఎస్సీ జనరల్‌కు కేటాయించారు. ఈ సారి ఇతర సామాజిక వర్గాల వారికి కేటాయించే అవకాశాలు ఉన్నాయి.

● మైదుకూరు, సింహాద్రిపురం మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులను ఇదివరకు ఓసీ జనరల్‌కు కేటాయించారు. ఈసారి ఇతరులకు కేటాయించే అవకాశం ఉంది.

కబ్జాదారులు ఉన్నారు జాగ్రత్త...

- భూసమస్యలపై సివిల్ కోర్టులో బాధితులు
- అక్రమాలకు స్వస్తి పలికేది ఎన్నడు
- జిల్లాలో ఆగని భూఅక్రమాలు

రాయచోటి (కలెక్టరేట్), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్లు, బస్టాండ్లలో జేబు దొంగలున్నారు జాగ్రత్త అని పోలీసులు బోర్డులు పెట్టేవారు. అందులో కొంత మంది ఫొటోలు కూడా అతికించి వీరు దొంగతనాలకు పాల్పడతారు.. మీరు జాగ్రత్తగా ఉండండి అని హెచ్చరిక బోర్డులో ఫొటోలు ఉంచేవారు. అయితే ప్రస్తుతం ఈ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల దొంగతనాలు అరికట్టడం చాలా వరకు సాధ్యమైంది. ఆధునిక సమాజంలో రెండు డిపార్టుమెంట్ల వారు కాస్త నిర్లక్ష్యం వహిస్తే సమాజం భ్రష్టు పట్టిపోతుంది అనే వాదన కూడా లేకపోలేదు. అందులో ఒకటి పోలీస్, రెండు రెవెన్యూగా చెప్పవచ్చు. పోలీసులు ప్రస్తుతం ఉన్న టెక్నాలజీ ఉపయోగించి దొంగతనాలు జరగకుండా అరికట్టగలుగుతున్నారు. రెవెన్యూ వారు మాత్రం భూకబ్జాల నుంచి ప్రజలను కాపాడలేకపోతున్నారనే విమర్శలున్నాయి. గ్రామాల్లో వీఆర్‌వోల పాత్ర కీలకంగా ఉండడంతో ప్రతి గ్రామంలోనూ అసైన్డ్ భూములు, ఎండోమెంట్ భూములు, గ్రామ కంఠాలు, వంకలు, వాగులు, చెరువులు ఆన్‌లైన్ చేసి కొంత వసూలు చేస్తున్నారని ప్రచారం ఉండేది. గత ప్రభుత్వంలో అన్నీ పూర్తి చేసేశారో ఏమో ఇప్పుడు గ్రామంలో ఎవరైతే లేరో వారి భూములు అవలీలగా వన్‌బీ, అడంగల్ ఎక్కించి అందినంత పుచ్చుకుంటున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో పీజీఆర్ఎస్‌లో దాదాపు 75 శాతం అర్జీలు అన్నీ కూడా భూకబ్జాలకు గురయ్యాయని అధికారుల దగ్గర లెక్కలు ఉన్నాయి. గతంలో జరిగిన భూఅక్రమాలకు పరిష్కారం దొరకక కొంతమంది బాధితులు సివిల్ కోర్టు తలుపు తడుతున్నారు. జిల్లాలో రాజంపేట, మదనపల్లె డివిజన్లలో ఎక్కువగా భూఅక్రమాలు గతంలో జరిగాయని, వీటికి పరిష్కారం కోసం తహసీల్దార్ల చుట్టూ తిరిగినా ఫలితం లేదని వారు జేసీ కోర్టు, ఆర్డీవో కోర్టుకు వచ్చామని చెబుతున్నారు. 2019-24 వరకు ఈ ప్రాంతాల్లో ఎక్కువగా భూఅక్రమాలు జరిగాయని, జిల్లా అధికారులు ఒక అంచనాకు వచ్చారు. రికార్డు పరంగా అన్ని ఆధారాలు ఉన్న బాధితుల కోసం పరిష్కారం వెతుకుతూ ఒక్కొక్క కేసును డిస్పోజల్ చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. రికార్డ్స్ ఆధారంగా పూర్తిగా పరిశీలన చేసి కేసును త్వరితగతిన పూర్తి చేసేందుకు జిల్లా అధికారులు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. రాయచోటి మండలం శిబ్యాల గ్రామానికి చెందిన దళితుల భూమిని కొందరు ఆక్రమించారని వారు అధికారులకు ఫిర్యాదు చేశారు. కొంతమంది ఆర్డీవో కోర్టులో పిటీషన్ వేసుకొని అక్కడ సరైన ఆధారాలు లేకపోవడంతో ప్రత్యర్థులపై మళ్లీ జేసీ కోర్టుకు కూడా వెళుతున్న పరిస్థితులు ఇక్కడ చాలా ఉన్నాయి. ఏదైనా భూమిని ఆక్రమించాలంటే ముందు తప్పుడు రికార్డ్స్ సృష్టించి ఆ తర్వాత పొలం మీదికి వెళ్లే పరిస్థితులు గతంలో ఎక్కువగా జరిగాయని రిటైర్డ్ తహసీల్దార్లు చెబుతున్నారు. ఈ విషయంపై డీఆర్‌వో మధుసూదన్‌రావును వివరణ కోరగా... మదనపల్లి, రాజంపేట డివిజన్లలో ఎక్కువ అక్రమాలు జరిగాయని, మేము ఒక అంచనాకొచ్చాము. అయితే ఆర్‌వోఆర్ కోర్టులో వేసుకున్న ప్రతి బాధితునికి న్యాయం చేసే విధంగా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాము. పూర్తి రికార్డు పరిశీలన చేసిన తర్వాతే తదుపరి ఆర్డర్స్ ఇస్తున్నాం.



రాయచోటి మండలం శిబ్యాల గ్రామంలో తమ భూమిని దౌర్జన్యంగా ఆక్రమించారని పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన బాధితులు (ఫైల్)

కేసులు నమోదు చేయాలి



పేదల భూములు ఆక్రమించి తప్పుడు రికార్డులు సృష్టించే వారిని రెవెన్యూ, పోలీసు వారు గుర్తించి కేసులు నమోదు చేస్తే కొంతవరకు భూఅక్రమాలకు కళ్లెం వేయొచ్చని మా అభిప్రాయం. రెండు ఎకరాలు భూమి గల పేదవాడు పొట్టకూటి కోసమై పట్టణానికి వెళితే ఆ భూమిని ఆ గ్రామంలో ఉన్న వారు కబ్జాలకు పాల్పడుతుంటే రెవెన్యూ వారికి తెలియకుండానే ఇదంతా జరుగుతోందా అని మేము ప్రశ్నిస్తున్నాం. శివుడి ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టలేదనేది సామెత. అలాగే రెవెన్యూ వారి సహకారం లేకుండానే జిల్లాలో భూఅక్రమాలు జరుగుతున్నాయా అని మేము జిల్లా అధికారులను అడుగుతున్నాం. ఎక్కడైతే భూఆక్రమణలు జరిగాయో ఆ గ్రామానికి సంబంధించిన వీఆర్‌వోలను తక్షణం సస్పెండ్ చేసి విచారణలో అవసరమైతే తహసీల్దార్‌ను కూడా సస్పెండ్ చేస్తే తప్ప భూఅక్రమాలకు కళ్లెం వేయలేం.

- జి.ఈశ్వరయ్య, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట

రామానాయుడి చెరువు చుట్టూ ట్రెంచ్ తీసిన పోలీసులు



రామానాయునిచెరువు చుట్టూ ట్రెంచ్ తీస్తున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు

గుర్రంకొండ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇసుకాసురుల అక్రమాలకు అడ్డుకట్ట వేయడానికి రెవెన్యూ, పోలీస్ అధికారులు రామానాయునిచెరువు చుట్టూ గురువారం ఎక్స్‌కవేటర్‌తో ట్రెంచ్ కొట్టించారు. ఈ చెరువులో కొన్ని నెలలుగా ఇసుక వ్యాపారులు ట్రాక్టర్ల ద్వారా ఇసుకను బయట ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాపై పత్రికలో పలుమార్లు వార్తలు ప్రచురితమయ్యాయి. దీంతో జిల్లా అధికారులు ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. ఈ క్రమంలో రామానాయునిచెరువు చుట్టూ గురువారం ఎక్స్‌కవేటర్ సాయంతో రెవెన్యూ అధికారులు పోలీసుల సమక్షంలో ట్రెంచ్ తీయించారు. ఇసుక ట్రాక్టర్లు చెరువులోకి ప్రవేశించే మార్గాలను మూసేశారు. ఈ క్రమంలో సుమారు 10 అడుగుల లోతు వరకు ట్రెంచ్‌ను కొట్టించారు. ఈ ట్రెంచ్ దాటుకుని చెరువులోకి ఇసుక ట్రాక్టర్లు ప్రవేశిస్తే వారిపై చర్యలు తప్పవని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. అలాగే ప్రతిరోజు రెవెన్యూ సిబ్బంది అక్రమ ఇసుక రవాణాపై దృష్టి పెట్టాలని సిబ్బందికి సూచించారు.

కళాశాలలో భద్రత కట్టుదిట్టం చేయండి

వాల్మీకిపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం ఏపీ మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో భద్రతా చర్యలు కట్టుదిట్టం చేయాలని సీఐ ప్రసాద్‌బాబు తెలిపారు. గురువారం కళాశాల ప్రిన్సిపాల్ రమామంజులతో మాట్లాడుతూ కళాశాల ఆవరణలో సీసీ కెమెరాలను పూర్తి స్థాయిలో ఉండేలా చూడాలన్నారు. బాలికల హైస్కూల్, కళాశాల ఒకే ప్రాంగణంలో ఉండటం తో ఇరు యాజమాన్యాలు బాధ్యతగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు.

ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి ముఖద్వారం వద్ద కూడా తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలాగే అనుమానిత వ్యక్తులు కళాశాల పరిసరాలలో కనిపిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం అందిస్తే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. గత ఆదివారం రాత్రి కళాశాలలో ఆకతాయిల ప్రవర్తన పట్ల ఆ ప్రాంతంలో రాత్రి గస్తీ కూడా పెట్టామని తెలిపారు. కళాశాలలో సమస్యల పరిష్కారం విషయమై స్థానిక ఎంపీడీవో మనోహరరాజు, ట్రాన్స్‌కో ఏఈ రాజశేఖర్‌లు పరిశీలించి పరిష్కార చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న సీఐ ప్రసాద్‌బాబు

జడ్జి బంగ్లాలో శ్రీగంధం చెట్ల నరికివేత



గుర్తు తెలియని వ్యక్తులు నరికేసిన శ్రీగంధం చెట్లు, పరిశీలిస్తున్న డీఎస్పీ కొండయ్యనాయుడు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలోని కదిరి రోడ్డులో గల బంగ్లాలో బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రెండు శ్రీగంధం చెట్లను నరికివేసి మొదళ్లను తీసుకెళ్లిపోయారు. ఉదయం గమనించిన జడ్జి బంగ్లా అటెండర్ మునివెంకట్ గురువారం వన్‌టౌన్ సీఐ ఎరిసావలికి ఫిర్యాదు చేశారు. వెంటనే మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు, వన్‌టౌన్ సీఐ ఎరిసావలి, ఎస్ఐ వెంకటశివ కుమార్ జడ్జి బంగ్లాకు చేరుకుని చెట్ల నరికివేతను పరిశీలించారు. అనంతరం అటెండర్ మునివెంకట్ ఫిర్యాదు మేరకు వన్‌టౌన్‌లో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పంచాయతీ నిధుల దుర్వినియోగం

- పనులు చేయకుండానే బిల్లులు
- రికార్డులు పరిశీలించిన డీఎల్‌పీవో



నిధుల దుర్వినియోగంపై విచారణ జరుపుతున్న డీఎల్‌పీవో

సుండుపల్లె, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వమంటేనే అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. మండల అభివృద్ధి నిధుల నుంచి గ్రామ పంచాయతీ నిధుల వరకు ఏ గ్రామంలో చూసినా లక్షలు భోంచేశారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం కాదు వైసీపీ నాయకులు, వైసీపీ మద్దతుదారులైన ప్రజాప్రతినిధుల జేబులు నింపుకునేందుకు అన్నట్లుగా ఇష్టారాజ్యంగా నిధులను దుర్వినియోగం చేశారు అనడంతో ఎటువంటి సందేహం లేదు. అలాంటిదే మండలంలోని ఒక చిన్న గ్రామ పంచాయతీ అయిన చిన్నగొల్లపల్లె. ఆ గ్రామంలో సుమారు రూ.40 లక్షల నిధుల దుర్వినియోగమయ్యాయని బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకరయ్య కొన్ని రోజుల క్రితం ఫిర్యాదు చేశారు. అందులో భాగంగా గురువారం చిన్నగొల్లపల్లె సచివాలయంలో నిధుల దుర్వినియోగంపై జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాజంపేట డీఎల్‌పీవో మస్తాన్‌వలీ విచారణ నిర్వహించారు. గత వైసీపీ ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు చిన్నగొల్లపల్లె పంచాయతీకి చెందిన పంచాయతీ నిధులు, 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరానికి పెద్ద మొత్తంలో అవినీతి జరిగిందని ఆరోపణలు రావడంతో రికార్డులను తనిఖీ చేశారు. కొన్ని ఎం-బుక్కులు రికార్డు చేశారు. మరికొన్ని బిల్లుల రూపంలో పెట్టి డ్రా చేసినట్లు రికార్డుల పరిశీలనతో తేలిందని డీఎల్‌పీవో మస్తాన్‌వలీ తెలిపారు. సమగ్రంగా విచారించి శుక్రవారం పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తానని తెలిపారు. అప్పయ్యగారిపల్లెకు సీసీ రోడ్డు వేయకుండానే వేసినట్లు రూ.1.74 లక్షల నిధులు డ్రా చేసినట్లు ఫిర్యాదుదారులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా పెద్దమొత్తంలో పనులు చేయకుండానే డబ్బులు డ్రా చేసి ఇష్టారాజ్యంగా వాడుకున్నారని, రెండు సంవత్సరాల వ్యవధిలో జరిగిన పనులను పల్లెల్లోకి వెళ్లి సమగ్రంగా విచారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌ఆర్‌డీ సురేశ్ బాబు, సర్పంచ్ జయచంద్ర, పంచాయతీ కార్యదర్శి రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

సమావేశానికి వైసీపీ నేతల డుమ్మా

- బి.కొత్తకోట మండలమీట్ వాయిదా..
- మండల పరిషత్ కార్యాలయం వద్దకు చేరుకున్న కూటమి శ్రేణులు



మండల పరిషత్ కార్యాలయం వద్ద కూటమి నాయకులు

బి.కొత్తకోట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండల సర్వసభ్య సమావేశం మరోసారి వాయిదా పడింది. గురువారం ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు సర్క్యులర్ పంపారు. అయితే మండలంలోని 11 మంది ఎంపీటీసీ సభ్యులు, 15 మంది సర్పంచులలో ఏ ఒక్కరూ సమావేశానికి హాజరు కాలేదు. దీంతో గంటపాటు వేచి చూసి సమావేశాన్ని నిర్వహించేందుకు అవసరమైన కోరం లేకపోవడంతో మండలమీట్‌ను వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో శంకరయ్య మధ్యాహ్నం 12 గంటలకు ప్రకటించారు. సెప్టెంబరు 20న జరగాల్సిన సమావేశం కూడా కోరంలేక రద్దు అయిన నేపథ్యంలో ఈనెల 19న జరపాలని భావించారు. అయితే ఎంపీపీ లక్ష్మీనరసమ్మ సహా సభ్యులెవరూ హాజరు కాలేదు. దీంతో వాయిదా వేశారు. ఈ విషయమై కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు నివేదిక సమర్పించినట్లు ఎంపీడీవో తెలిపారు. కాగా గత సమావేశం రోజున కూటమి నాయకులు మండల పరిషత్ కార్యాలయం వద్దకు చేరుకుని ప్రస్తుతం ఉన్న సభ్యులెవరూ ప్రజలచేత ఎన్నిక కాకుండా ఎవరో సెలెక్ట్ చేస్తే అక్రమమార్గంలో వచ్చారని, వారందరూ రాజీనామా చేసి ఎన్నికల్లో గెలిచి రావాలంటూ అడ్డు తగిలారు. అలాగే గురువారం కూడా అదే సీన్ రిపీట్ అయింది. కార్యాలయం వద్దకు కూటమి నాయకులు భారీగా చేరుకున్నారు. సీఐ జీవన్‌గంగాధర్ బాబు పర్యవేక్షణలో పోలీసులు కూటమి నాయకులను లోపలికి వెళ్లనీయకుండా అడ్డుకున్నారు. దీంతో వీరు గేటు వద్దే గుమికూడి సెలెక్టెడ్ వైసీపీ సభ్యులను రానివ్వబోమని నినాదాలు చేస్తూ అక్కడే వేచి ఉన్నారు. ఎట్టకేలకు సమావేశం వాయిదా పడటంతో హాజరైన మండలస్థాయి అధికారులతో సహా అందరూ తిరుగుముఖం పట్టారు.

పెన్నపేరూరును తనిఖీ చేసిన ఆర్డీవో



గ్రామంలో వివరాలు సేకరిస్తున్న ఆర్డీవో

ఒంటిమిట్ట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సోమశిల వెనుకజలాల ద్వారా పెన్నపేరూరు గ్రామంలోకి నీరు రావడాన్ని ఆర్డీవో జాన్ ఎర్విన్ దృష్టికి తీసుకెళ్లడంతో గ్రామంలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలో ఏ మేరకు నీరు చేరుతోంది.

సోమశిల బ్యాక్‌వాటర్ పరిధి ఏ మేరకు ఉందనే దానిపై సోమశిల అథారిటీ ద్వారా సమాచారం తెప్పించుకుని పూర్తి నివేదిక తయారు చేయాలని తహసీల్దారు రమణమ్మకు సూచించారు. గ్రామంలోని ప్రజలకు ఇబ్బంది కలగకుండా శానిటేషన్ వైద్యసిబ్బందిని అందుబాటులో ఉంచాలని నిరంతరం ప్రజలకు సేవలందించాలని ఆయన సూచించారు. ఇళ్లకు పరిహారం ఇవ్వాలని, పరిహారం ఇస్తే ఇక్కడి నుంచి వెళతామని ఆర్డీవోకు స్థానికులు తెలపడంతో దీనిపై ఉన్నతాధికారులకు తెలియజేయడం జరుగుతుందని ఆయన అన్నారు.

అక్రమ కట్టడాల తొలగింపు



ఎక్స్‌కవేటర్‌తో ఆక్రమణలను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

సిద్దవటం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రెవెన్యూ స్థలాల్లో అక్రమ కట్టడాలు తొలగించేందుకు రెవెన్యూశాఖ ఉక్కుపాదం మోపింది. ప్రభుత్వ స్థలాలు కనపడితే ఆక్రమణదారులు పాగా వేయడం, రాత్రికి రాత్రే కట్టడాలు మితిమీరిపోయి వారికి అడ్డూ అదుపులేకుండా పోయింది.

మండలంలోని పెద్దపల్లె రెవెన్యూ సర్వేనంబరు 641/1 లెటర్ భాకరాపేట గ్రామానికి చెందిన తుర్రా సుబ్బలక్షుమ్మ వైసీపీ ప్రభుత్వంలో వైసీపీ పెద్దలను అడ్డుపెట్టుకుని ప్రభుత్వ వంక పొరంబోకు స్థలాన్ని 11 సెంట్లు ఆక్రమించి స్థలాన్ని అన్యాక్రాంతం చేశారు. మాధవరం గ్రామం సర్వేనంబరు 864/7 గ్రామ సచివాలయం-2 పరిధిలో గత ప్రభుత్వంలో వంక పొరంబోకు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి భవనాలను నిర్మించారు. పలువురు ఫిర్యాదు చేయడంతో రెవెన్యూశాఖ అక్రమార్కులపై ఉక్కుపాదం మోపి పూర్తిగా భవనాలు తొలగించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకా ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం చేసిన వారిపై చర్యలు చేపట్టింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక పోలీసు సిబ్బంది కట్టుదిట్టమైన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి తహసీల్దారు మాధవిలత, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

చెంగుచెంగున..

అది ఆషామాషా వన్యప్రాణి కాదు.. రామాయణంలో శ్రీరామచంద్రమూర్తి సీతతో కలిసి వనవాసం వెళ్లిన సమయంలో.. సీతమ్మకు కనువిందు చేసిన ప్రాణి. రామాయణంలో సీతారాముల జీవితం మలుపు తిరగడానికి.. ఒక రకంగా చెప్పాలంటే రావణసంహారానికి కారణం ఇదే వన్యప్రాణి. అయితే రామాయణంలో విన్నది మాయలేడి (జింక) గురించి.. నిజమైన లేడిని చూడాలంటే కడప నగర శివారులోని కేఎస్ఆర్ఎం కళాశాల వెనుకవైపునకు వెళితే చాలు. ఇక్కడ ఈ అందమైన వన్యప్రాణులు గుంపులు గుంపులుగా కనిపిస్తాయి. చెంగుచెంగున ఎగురుతూ కనువిందు చేస్తాయి. అక్కడికి నిత్యం గుంపులుగా వచ్చి మేతమేసి వెళుతున్నాయి.

- ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కడప











జీవితానికి ఆర్థిక భరోసా... పీఎల్ఐ

- తక్కువ ప్రీమియం...ఎక్కువ బోనస్
- పాలసీల ద్వారా ఉద్యోగుల జీవితాలకు వెలుగులు

కడప మారుతీనగర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వం తపాలా శాఖ ద్వారా ప్రవేశపెట్టిన తపాలా జీవిత బీమా పథకం (పీఎల్ఐ) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల జీవితాలకు ఆర్థిక భరోసా నిచ్చేలా దోహదపడుతోంది. 1884 ఫిబ్రవరి 1న కేవలం తపాలాశాఖలో ఉద్యోగం చేసే పురుషుల కోసం ప్రారంభైన పీఎల్ఐ కాలగమనంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కార్పొరేషన్ ఉద్యోగులు, గుర్తింపు పొందిన ఇంజనీరింగ్ కళాశాలల ఉద్యోగులు, ప్రొఫెషనల్ డిగ్రీ కలిగిన బీటెక్, ఎంబీబీఎస్, ఎంబీఏ, ఎంసీఏ, విద్యనభ్యసించి ప్రయివేటు ఉద్యోగం చేసేవారు. బ్యాంక్ ఉద్యోగులు, న్యాయవాదులు, వైద్యులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులు, చార్టెడ్ అకౌంటెంట్లు తదితర విభాగాల వారికి వర్తించేలా కేంద్రంలోని నరేంద్రమోదీ సర్కార్ ఇటీవల జీవో జారిచేసింది.

18 నుంచి 55 సంవత్సరాల లోపు వారు అర్హులు

పీఎల్ఐ స్కీంలో చేరేందుకు 18 నుంచి 55 సంవత్సరాల లోపు వయస్సు గల వారు అర్హులు. ఇందులో పాలసీని రూ.20 వేల నుంచి దాదాపు రూ.50 లక్షల వరకు తీసుకునే సౌకర్యముంది. ఇదిలా వుండగా 2017 ఏప్రిల్ 1న వెలువడిన జీవో ప్రకారం పైన తెలిపిన ఉద్యోగులు పీఎల్ఐ పాలసీలు తీసుకునే సౌకర్యాన్ని కేంద్రప్రభుత్వం కల్పించింది. పాలసీలు మూడు విధాలుగా 3 నెలలు, 6 నెలలు, 1 సంవత్సరానికి ఒకసారి కట్టుకునే సౌలభ్యం కల్పించింది. కాగా 6 నెలలకు ఒక సారి కట్టుకునే పాలసీకి 1 శాతం, సంవత్సరం పాలసీకి 2 శాతం డిస్కౌంట్ వర్తించే సౌలభ్యం కలదు. పీఎల్ఐలో ప్రధానంగా 6 రకాల పాలసీలు అమలవుతున్నాయి. వాటిలో సువిధ, సుమంగళి, యుగళ్ సురక్ష, సురక్ష, సంతోష్, బాలజీవన్ బీమా పాలసీలున్నాయి.

సువిధ : ఇందులో హోల్ లైఫ్ పాలసీదారులు 5 సంవత్సరాలు పూర్తి అయిన తర్వాత సంతోష్ పాలసీలోకి మారే వెసులుబాటు కల్పించారు. తక్కువ డబ్బులు కట్టుకునే వీలుతో పాటు రుణం తీసుకునే సౌకర్యం కలదు.

సుమంగళి : ఈ పాలసీని మనీ బ్యాక్ పాలసీ అని కూడా అంటారు. ఈ పాలసీలో 15 సంవత్సరాల పాటు కట్టిన పాలసీదారులు వరుసగా 6 సంవత్సరాలు పూర్తి కాగానే కట్టిన మొత్తం నుంచి 20 శాతం, 9 సంవత్సరాల తర్వాత మరో 20 శాతం, 12 సంవత్సరాల తర్వాత మరో 20 శాతం, చివరగా 15 సంవత్సరాల తర్వాత 40 శాతం డబ్బులతో పాటు అదనపు బోనస్ చెల్లింపు వర్తిస్తుంది. దీంతో పాటు 20 సంవత్సరాల పాలసీల బోనస్‌తో లభిస్తుంది. ప్రధానంగా మధ్యతరగతి ఉద్యోగులకు ఎంతో ప్రయోజనకరం.

యుగళ్ సురక్ష : ఇది జాయింట్ పాలసీ. ప్రీమియం ఒకరు చెల్లించాల్సి వుంటుంది. రిస్క్ కవరేజ్ మాత్రం ఇద్దరికి (భార్యాభర్తలకు) వర్తిస్తుంది. ఈ పాలసీకి సంతోష్ పాలసీ నిబంధనలు వర్తిస్తాయి. ఇందులో 5 నుంచి 20 సంవత్సరాలలోపు వయస్సు గల వారు మాత్రమే అర్హులు. కాగా ఈ పాలసీ కింద రూ.3లక్షల కంటే మించి ఇవ్వరు. తల్లిదండ్రులు ఇద్దరిలో కచ్చితంగా పాలసీ వుంటేనే వర్తిస్తుంది.

సురక్ష : హోల్ లైఫ్ పాలసీ. ఇందులో 19 సంవత్సరాల నుంచి 58 సంవత్సరాల గల వారు పాలసీకి అర్హులు. రూ.20 వేల నుంచి 50 లక్షల వరకు పాలసీ ప్రీమియం. కాగా 4 సంవత్సరాలు కట్టిన తర్వాత రుణం తీసుకునే సౌలభ్యం కలదు. సుమారు 60 సంవత్సరాల పాటు ప్రీమియం కట్టాల్సి వుంటుంది. 80 సంవత్సరాల తర్వాత డబ్బులు తీసుకోవచ్చు. ప్రతి లక్ష రూపాయలకు రూ.7600 బోనస్‌గా సంవత్సరానికి అందుతుంది.

సంతోష్ : ఈపాలసీ తీసుకున్న వారు 3 సంవత్సరాల తర్వాత రుణం తీసుకునే సదుపాయం కలదు. కాగా కట్టిన ప్రీమియం మొత్తం ట్యాక్స్ సేవింగ్ బెనిఫిట్ కింద వెసులుబాటు కలదు. పాలసీ ఆమోదించిన నాటి నుంచి పూర్తి జీవిత రక్షణ వుంటుంది. తపాలా శాఖ ద్వారా తీసుకున్న పాలసీలలో అధిక శాతం (80 శాతం) మంది వినియోగదారులు ఈ సంతోష్ పాలసీవైపే మొగ్గుచూపుతున్నారు.



కడప తపాలా శాఖ ప్రధాన కార్యాలయం

బాలజీవన్ పాలసీ : 5 నుంచి 20 సంవత్సరాల లోపు బాల, బాలికలు అర్హులు. ప్రధానంగా పీఎల్ఐ పాలసీలో వారి తల్లి-దండ్రులు నమోదై వుంటేనే.. బాలజీవన్ పాలసీ వర్తిస్తుంది. ఇందులో రూ.20 వేల నుంచి రూ.30 లక్షల వరకూ పాలసీ తీసుకునే సౌకర్యం కలదు.

పీఎల్ఐ పాలసీ ద్వారా మంచి రాబడి



తపాలా శాఖ ద్వారా అందే పీఎల్ఐ పాలసీ ద్వారా మంచి రాబడి అందుతుంది. మిగతా అన్ని ఇన్సూరెన్స్ సంస్థల నుంచి వచ్చే రాబడి కన్నా మెరుగైన ఆదాయం వస్తుంది. అన్ని రకాల ఉద్యోగులు పీఎల్ఐ సేవలను సద్వినియోగం చేసుకోవచ్చు.

-రాజేష్, ప్రధాన తపాలా కార్యాలయ సూపరింటెండెంట్

విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణ ప్రమాదకరం



ధర్నాలో ప్రసంగిస్తున్న 1104 యూనియన్ నాయకుడు

ఎర్రగుంట్ల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఆర్టీపీపీలో ఉద్యోగులు గురువారం పవర్‌హౌస్ మెయిన్ గేటు వద్ద ధర్నా చేపట్టారు. ఉత్తరప్రదేశ్, చండీఘర్‌లోని డిస్కంల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఏఐఎఫ్ఈఈ, ఎన్‌సీసీ ఏఈఈఈ పిలుపు మేరకు నిరసన చేపట్టి ఉద్యోగులు నినాదాలు చేశారు. ఉద్యోగ సంఘాల నేతలు మాట్లాడుతూ విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ప్రైవేటీకరణతో వచ్చే పరిణామాలతో ప్రజలపై మోయలేని విద్యుత్ భారం పడుతుందన్నారు. ఉద్యోగులకు భద్రత లేకుండా పోతుందని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణను విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

నాలుగు పంచాయతీలకు తీరనున్న మంచినీటి కష్టాలు

- చిత్రావతి నుంచి రూ.7.3 కోట్లతో మంచినీటి పైపులైను

కొండాపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాలుగు గ్రామ పంచాయతీలకు మంచినీటి కష్టాలు తీరనున్నాయి. గత వేసవిలో పలు గ్రామాల్లో తీవ్ర నీటి ఎద్దడి ఉన్నా, గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం రాగానే మంచినీటి కష్టాలు తీర్చేందుకు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమావేశం నిర్వహించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అందులో భాగంగా మొదటి విడతగా ప్రాధన్యత క్రమంలో నీటిఎద్దడి ఉన్న పంచాయతీలను అధికారులు గుర్తించారు. కొండాపురం, ఓబన్నపేట, తాళ్లప్రొద్దుటూరు, సుగుమంచిపల్లె పంచాయతీలలో మంచినీటి ఎద్దడిని తీర్చేందుకు ఏటూరు వద్ద నున్న చిత్రావతినది నుంచి పైపు లైను వేయనున్నారు. ఇందుకోసం రూ.7.3 కోట్లతో నాలుగు బ్లాకులుగా టెండర్లు కూడా పిలిచారు. ఇందులో తాళ్లప్రొద్దుటూరు, ఓబన్నపేట పంచాయతీలకు టెండర్లు పూర్తయినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లక్ష్మీప్రసాద్ తెలిపారు. కొండాపురం, సుగుమంచిపల్లె పంచాయతీలకు సంబంధించి టెండర్లలో కాంట్రాక్టర్లకు అర్హత లేకపోవడంతో రద్దయినట్లు తెలిపారు. త్వరలోనే వీటికి కూడా తిరిగి టెండర్లు పిలుస్తారని ఏఈ తెలిపారు.

కోదండరామున్ని దర్శించుకున్న రవికుమార్

ఒంటిమిట్ట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర అయోధ్యగా పేరుగాంచిన కోదండరామున్ని ఆముదాల వలస ఎమ్మెల్యే కూన రవికుమార్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరికి టీటీడీ అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతారామ లక్ష్మణులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ చరిత్రను, విశిష్టతను తెలియజేశారు. టీటీడీ అర్చకులు పవన్‌కుమార్, టీటీడీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లావనూరు వద్ద జరిగింది హత్యేనా?

- పోలీసుల అదుపులో నిందితులు

కొండాపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లావనూరు సమీపంలో మంగళవారం అనంతపురం జిల్లా యల్లనూరుకు చెందిన సురేష్ అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన సంగతి తెలిసిందే. రెండు రోజులుగా కొండాపురం పోలీసులు యల్లనూరులో విచారిస్తున్నారు. యల్లనూరు నుంచి అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఈ కేసులో పోలీసులు ముగ్గురిని అదుపులో తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది. అదే విధంగా ఒక జీపును కూడా స్వాధీనపరుచుకున్నట్లు సమాచారం. సంఘటన స్థలంలో పడిన మృతదేహం తీరు, పోస్టుమార్టం ఆధారంగా సురేష్‌ది హత్యగానే పోలీసులు భావిస్తున్నారు. కాగా నిందితులను నేడో, ఎల్లుండో అరెస్టు చేసే అవకాశం ఉంది.

పొలం పనిచేస్తూ... మహిళా కూలీ మృతి



పొలం వద్ద మృతి చెందిన మహిళా కూలీ రామక్క

వల్లూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్దపుత్త గ్రామ పొలంలో గురువారం పొలం పనిచేస్తూ మహిళా కూలీ రామక్క హఠాత్తుగా మృతి చెందింది. తోటి కూలీల వివరాల మేరకు.. ప్రొద్దుటూరు మండల పరిధిలోని సీతంపల్లెకు చెందిన ఓ రైతు పెద్దపుత్త గ్రామ పొలాల్లో భూమిని కౌలుకు తీసుకుని దోస తోట సాగు చేశాడు. అందులో కలుపు తీయడానికి తమ గ్రామం నుంచి సుమారు 30 మంది కూలీలను ఆటోల్లో తీసుకుని వచ్చాడు. ఉదయం నుంచి పొలంలో కలుపుతీత పనులు చేస్తుండగా కూలీల్లో ఒకరైన రామక్క మధ్యాహ్నం సుమారు 3.30గంటల సమయంలో ఉన్నట్లుండి కుప్పకూలి స్పృహ తప్పి పడిపోయింది. తోటి కూలీలు ఆమెకు సపర్యలు చేస్తూ 108 వాహనానికి ఫోను చేశారు. వారు వచ్చి పరీక్షించి ఆమె అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు.

ట్రాన్స్‌ఫార్మర్లు పగలగొట్టి కాపర్ వైరు చోరీ



లింగాల,డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలిదండ్ల గ్రామలో గురువారం గుర్తుతెలియని వ్యక్తులు వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసి అందులోని కాపర్ వైరును దొంగిలించారు. విద్యుత్ శాఖ ఏఈ బాలసంజీవులు మాట్లాడుతూ కరెంటు ఉండగానే ట్రాన్స్‌ఫార్మర్‌కు వచ్చే విద్యుత్ లైన్ కట్ చేసి ఒక ఫేజ్ మరొక ఫేజ్‌వైరు టచ్‌కాకుండా తాడుతో కట్టి ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి కాపర్ వైరు దొంగిలించారన్నారు. నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేయడంతో సుమారు లక్ష రూపాయలు సంస్థకు నష్టం వాటిల్లిందని, ఆ మేరకు లింగాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు.

పెనుగొండకు కేంద్ర సాహిత్య పురస్కారం అభినందనీయం

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణను కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వరించడం అభినందనీయమని కడప జిల్లా అరసం అధ్యక్షుడు అచార్య ఎన్.ఈశ్వరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పెనుగొండ లక్ష్మీనారాయణ కవిగా రచయితగా విమర్శకుడిగా న్యాయవాదిగా బహుముఖ కోణాల్లో సామాజిక సేవ చేశారన్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘానికి అధ్యక్షుడిగా ఉంటూ జాతీయ మహాసభలను దిగ్విజయంగా నిర్వహించారని, ఇతర రాష్ట్రాల రచయితలకు తెలుగువారి గొప్పదనాన్ని తెలియజేశారన్నారు. భారతదేశంలో సామాజిక కల్లోలాలు ఏర్పడిన ప్రతి సందర్భంలోను సాహిత్యకారులను ఏకం చేస్తూ రచనల ద్వారా జనాన్ని చైతన్య పరుస్తున్నారని తెలిపారు. పెనుగొండ రాసిన దీపిక అనే విమర్శ గ్రంథానికి పురస్కారం లభించిందని, ఆయన రాసిన గుంటూరు సీమ సాహిత్య చరిత్ర భావి పరిశోధకులకు ఒక నమూన గ్రంథంగా నిలుస్తుందన్నారు. భవిష్యత్తులో ప్రతి జిల్లా నుంచి ఇలాంటి చరిత్రలు రావడానికి ఇది ప్రేరణ ఇచ్చిందని తెలిపారు. అరసం కడప జిల్లా ప్రధాన కార్యదర్శ డాక్టర్ తుమ్మలూరు సురేష్‌బాబు, ఉపాధ్యక్షుడు డాక్టర్ రాజగోపాల్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు పెనుగొండకు పురస్కారం రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

హెల్మెట్‌ను బరువుగా కాకుండా బాధ్యతగా ధరించాలి

- అర్బన్ సీఐ చంద్రశేఖర్, ట్రాఫిక్ సీఐ విశ్వనాథ రెడ్డి
- రాయచోటిలో హెల్మెట్ వాడకంపై అవగాహన ర్యాలీ

రాయచోటిటౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్‌ను బరువుగా కాకుండా బాధ్యతగా ధరించి సురక్షితంగా గమ్యం చేరాలని ద్విచక్ర వాహనదారులకు అర్బన్ సీఐ చంద్రశేఖర్, ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డి సూచించారు. ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు డీఎస్పీ కృష్ణమోహన్ నేతృత్వంలో గురువారం రాయచోటిలో హెల్మెట్ వాడకంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని అర్బన్ సీఐ చంద్రశేఖర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈర్యాలీ స్థానిక శివాలయం నుంచి కలెక్టరేట్ వరకు సాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డుపై ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ వాడకాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. లక్షలాది రూపాయలు వ్యయం చేసి బైక్‌లు కొన్న వారు హెల్మెట్ వాడకపోవడంతో ప్రమాదాలకు గురై ప్రాణాలు పోగొట్టుకోవడం బాధాకరమన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ప్రమాదాలలో హెల్మెట్ లేకపోవడం వల్లనే అధికంగా మృత్యువాతపడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. హెల్మెట్ లేని ప్రయాణం సురక్షితం కాదని, తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని లేని పక్షంలో పోలీసు చర్యలు తప్పవని వారు హెచ్చరించారు. ఈ ర్యాలీలో లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ సభ్యులు, శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం, విద్యార్థులు, ప్రజలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



హెల్మెట్ అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న సీఐ చంద్రశేఖర్

ఇంధన పొదుపుతో భవిష్యత్తులో వెలుగులు

చెన్నూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజలు వాడే ఇంధనాన్ని ముందు జాగ్రత్తగా పొదుపు చేసుకోవాలని తద్వారా భవిష్యత్తులో వెలుగులు చూడవచ్చని ట్రాన్స్‌కో ఈఈ హరిసేవియానాయక్ అన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా మండలంలోని కొండపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా విద్యార్థులు భవిష్యత్తులో ఇంధన అవసరాలు గుర్తించాలన్నారు. రాబోవు కాలంలో బొగ్గు నిల్వలు తగ్గుతాయని. అలాంటప్పుడు ఇంధన కొరత ఏర్పడే అవకాశం ఉందన్నారు. సౌరశక్తిని ఎక్కువగా వాడే విధానాలపై అవగాహన పెంచుకోవాలన్నా రు. విద్యార్థులు తమ కుటుంబాల్లో తల్లిదండ్రులకు ఇంధన పొదుపు గురించి చెప్పడంతో పాటు సౌరశక్తి వాడడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించాలన్నారు. అంతేకాక ఆఫీసులు, కళాశాలలు, పాఠశాలలు, పరిశ్రమలు లాంటి చోట వారి విధులు ముగించుకుని ఇంటికి వెళ్లే సమయంలో ఫ్యాన్లు, లైట్లు, స్విచ్ఛాఫ్ చేయాలన్నారు. అనవసరంగా ఫ్రిజ్‌లు తెరిచిమూయడం, నాశిరక బల్బులు వాడడం, రైతులు మోటర్లను ఆటోమేటిక్ ఏర్పాటు చేసుకోవడం లాంటి వాటి వల్ల ఎక్కువ నష్టం జరుగుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు ఇంధన పొదుపుపై రాత పరీక్ష నిర్వహిం చి బహుమతులు ప్రదానం చేశారు. అలాగే పోస్టర్లను కూడా విడుదల చేశారు. ట్రాన్స్‌కో డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ రామలింగారెడ్డి, సబ్ ఇంజనీరు స్రవంతి, సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతి ప్రదానం చేస్తున్న ట్రాన్స్‌కో ఈఈ హరిసేవియానాయక్

అమిత్‌షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలి

కడప సెవెన్ రోడ్స్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సాక్షిగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను వెంటనే బర్తరఫ్ చేయాలని డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బారావు డిమాండ్ చేశారు. గురువారం అంబేడ్కర్ సర్కిల్‌లో జరిగిన ఆందోళనలో ఆయన మాట్లాడుతూ భారతజాతి ముద్దుబిడ్డ, బహుజనుల ఆశాజ్యోతి అయిన అంబేడ్కర్‌ను తలుచుకుంటే ఏమొస్తుంది అంటూ వ్యాఖ్యానించిన అమిత్‌షాను తక్షణం మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసి, భారతజాతికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, నగర కార్యదర్శి వెంకటశివ,జిల్లా కార్యవర్గ సభ్యులు పి.చంద్రశేఖర్, ఎం.వి.సుబ్బారెడ్డి, జి.వేణుగోపాల్, కే.సి.బాదుల్లా, ఇమ్మానియేల్, కె.మునయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో...: అంబేడ్కర్‌పై కేంద్ర హంశాఖ మంత్రి అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలు దుర్మార్గమని, వెంటనే పదవికి రాజీనామా చేయాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎన్‌డీ విజయజ్యోతి డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కడప ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీనాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు అప్జల్‌ఖాన్, అలీఖాన్, బండిజకరయ్య తదితరులు పాల్గొన్నారు



కడపలో అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన తెలుపుతున్న డీహెచ్‌పీఎస్, సీపీఐ సభ్యులు

రాయచోటిలో...: అంబేడ్కర్‌ను కించపరిచేలా అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆయన వ్యాఖ్యలకు నిరసనగా గురువారం వారు రాయచోటి తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగ రూపశిల్పి అయిన డాబీఆర్ అంబేడ్కర్ గురించి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు భారతజాతిని అవమానించినట్లేనన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, రామాంజనేయులు, విశ్వనాథ నాయక్, పల్లం తాతయ్య, సాంబశివ, రెడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

అయ్యో... ఎంత కష్టం



- కంపచెట్ల పాలైన పసికందు

జమ్మలమడుగు రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): 'ఆ తల్లికి ఎంత కష్టం వచ్చిందో తెలియదు. ఎవరు చేసిన పాప ఫలితమో అంతుచిక్కడంలేదు. గజగజమని చలి వణికిస్తున్నా అభం, శుభం తెలియని పసికందును కంపచెట్లలో పడేసి వెళ్లారు. వివరాల్లో కెళితే... స్థానిక ముద్దనూరు రోడ్డులోని ఎత్తపువారి కాలనీ రోడ్డు పక్కన గనిగుంతల కంపచెట్లలో ఒక రోజు వయసున్న బిడ్డను కంపచెట్లలో పడేసి వెళ్లారు. ఎప్పుడు పడేశారో తెలియదు కాని గురువారం వేకువ జామున బహిర్భూమికి వెళ్లిన లూకా అనే వ్యక్తికి ఏడుపు వినిపించడంతో.. ఆ ప్రాంతానికి వెళ్లి చూడగా.. రోజు వయసున్న పసికందు కనిపించింది. అప్పటికే శరీరానికి చీమలు ఎక్కి శరీరమంతా తిరుగాడుతున్నాయి. వెంటనే ఆయన పసికందును చేతికి తీసుకుని చీమలను తొలగించి నీటితో శుభ్రం చేశాడు. ఈసమాచారాన్ని పోలీసులకు చేరవేశాడు. ఈవిషయం తెలియడంతో చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని మనిషికో మాట మాట్లాడుతూ వెళుతున్నారు తప్ప బిడ్డ ఆలనా పాలనపై ఎవరూ నోరెత్తడం లేదు. దీంతో అక్కడకు చేరుకున్న పోలీసులు పసికందును స్థానిక అంగన్వాడీ కేంద్రానికి అప్పగించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం చేయించారు. రోజు వయసున్న పసికందు ఆరోగ్యంగానే వున్నట్లు డాక్టర్లు నిర్ధారించారు. అయితే పసికందును సంరక్షించాలంటే కడప చైల్డ్ ప్రొటక్షన్ హోమ్‌కు తరలించాలని నిర్ణయించారు. ఆమేరకు కడప చైల్డ్ హోమ్ వారికి సమాచారం అందించి అక్కడికి తరలించారు. పోలీసులు, అంగన్వాడీ పర్యవేక్షణలో ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఘటనపై అర్బన్ సీఐ లింగప్ప ఎస్ఐ రామకృష్ణ ఆరా తీస్తున్నారు.



అంగన్వాడీ, మహిళా పోలీసు పర్యవేక్షణలో పసికందు

'హైస్కూల్ ప్లస్‌లను కొనసాగించాలి'

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): హైస్కూల్ ప్లస్‌లను కొనసాగించాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడే ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, ఏపీసీపీఎస్‌ఈఏ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఎస్ఆర్ వెంకటజనార్దన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో కోరారు. నూతన విద్యావిధానం అమలులో భాగంగా గత రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత పాఠశాలల్లో ఇంటర్ విద్యాబోధనకు రాష్ట్ర వ్యాప్తంగా అనేక మండలాల్లో హైస్కూల్ ప్లస్‌లను ఏర్పాటు చేశారన్నారు. వీటిని కూటమి ప్రభుత్వం రద్దుచేయాలని యోచిస్తున్నట్లు తెలిసిందన్నారు. హైస్కూల్ ప్లస్‌లను జిల్లా పరిషత్ జూనియర్ కళాశాలలుగా మార్చి అందులో పనిచేస్తున్న ప్రస్తుత పీజీటీలను పూర్తిగా రెగ్యులర్ చేసి ప్రిన్సిపాల్ పోస్టులను మంజూరు చేయాలని కోరారు.

రామకృష్ణారెడ్డి సేవలు అభినందనీయం

కడప నాగరాజుపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వివేకానంద సేవాశ్రమ వ్యవస్థాపకుడు రామకృష్ణారెడ్డి సేవలు అభినందనీయమని వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు ఆర్.వి.కృష్ణకిశోర్ పేర్కొన్నారు. గురువారం ఆ శాఖ కార్యాలయంలో సేవాశ్రమానికి సంబంధించన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ శివరామిరెడ్డి, హుస్సేన్, గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యేసు మార్గం అనుసరణీయం

● వైవీయూ ప్రధానాచార్యులు రఘునాథరెడ్డి
● ఘనంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దేవుని మార్గం అనుసరణీయమని యోగి వేమన విశ్వవిద్యాలయం ప్రధాన ఆచార్యులు ఎస్.రఘునాథరెడ్డి అన్నారు. గురువారం విశ్వవిద్యాలయలో విద్యార్థుల ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆచార్య రఘునాథరెడ్డి, విశిష్ట అతిథి ఆచార్య పద్మ, దైవ సందేశకులు బెన్నీ ప్రసాద్ కేక్ కట్ చేసి ముందస్తు క్రిస్మస్ వేడుకలను ప్రారంభించారు. ప్రధానాచార్యులు రఘునాథరెడ్డి ముఖ్యఅతిథగా హాజరై క్రిస్మస్ ఇచ్చే సందేశంగా ఇతరులకు ఇవ్వటంలో ఆనందం ఉందన్నారు. నిస్వార్థంగా ఉండాలని, దేవుడు లోకాన్ని ప్రేమించడానికి వచ్చాడని చెప్పారు. కులసచివులు ఆచార్య పద్మ మాట్లాడుతూ అన్ని మతాల సారాంశం ఒక్కటే అని, శాంతిని దయను సేవా భావాన్ని పెంపొందిస్తాయని చెప్పారు. ఇలాంటి పండుగల సందర్భంలోనే ఏ మతంవారమైనా అందరం ఒక తాటిమీదికి రావాలని కోరారు. బెన్నీ ప్రసాద్ మాట్లాడుతూ దేవుడి మీద నమ్మకం మనల్ని ఉన్నతంగా జీవించేలా చేస్తుందన్నారు. ఆయన తన జీవితాన్ని ఒక ఉదాహరణగా చెప్పారు. టెన్త్ ఫెయల్ అయి గోవాకు పారిపోయిన దశ నుంచి ఆస్తమా నుంచి బయటపడి, మ్యూజిక్ ప్లేయర్‌గా ఎదిగి ఢిల్లీలోని ప్రముఖమైన శ్రీరామ్ కళాశాల స్పీకర్ అయిన క్రమాన్ని వివరించారు.అలుమ్ని జాన్సన్ ఆధ్వర్యంలో ఆలపించిన గీతాలు అలరించాయి. ట్రాన్స్‌లేటర్‌గా సాల్మన్ వ్యవహరంచారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రార్థనలలో పాల్గొన్న ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రఘునాథరెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పద్మ



కేక్ కట్‌చేస్తున్న క్రిస్టియన్ రైట్ ప్రొటెక్షన్ ఫోర్స్ సభ్యులు

నిరంతర ప్రార్థనతోనే దైవబలం సాధ్యం

కడప కల్చరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రానున్న క్రిస్మస్ పర్వదినం సందర్భాన్ని పురస్కరించుకుని క్రిస్టియన్ రైట్ ప్రొటెక్షన్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్) స్టేట్ యూత్ వైస్ ప్రెసిడెంట్ ఇల్లూరి సురేష్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక సీఎస్ఐ సెంట్రల్ చర్చి ఉమెన్స్ ఫెలోషిప్‌లో ముందస్తు సెమీ క్రిస్మస్ వేడుకలు కన్నులపండువగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా దైవ ప్రసంగీకులు బి. సుధీర్ హాజరై తొలుత క్రిస్మస్ కేక్‌ను కట్‌చేసి సందేశం ఇచ్చారు. క్రీస్తు గురించి ప్రార్థన చేయడం వలన దైవబలం వస్తుందన్నారు. బాల యేసు జననం గురించి అప్పట్లో జ్ఞానులు ప్రపంచానికి చాటి చెప్పారని గుర్తు చేశారు. అనంతరం పేదలకు చీరలు పంపిణీ చేశారు. సీఆర్‌పీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్, యూత్ ప్రెసిడెంట్ షాలీమ్ ఎంబీసీ రాష్ట్ర అధ్యక్షుడు బాదుల్లా, మానవహక్కుల సంఘం నాయకులు అలీషేర్ విశ్వాసులు పాల్గొన్నారు.



ప్రముఖ అంతర్జాతీయ ప్రసంగీకుడు బిన్ని ప్రసాద్‌తో వైవీయూ విద్యార్థులు

పైప్‌లైన్ పనులు త్వరితగతిన పూర్తిచేయాలి

పులివెందుల రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణానికి నీటిని సరఫరాచేసే పైప్‌లైన్ పనులు త్వరిగతిన పూర్తిచేయాలని మున్సిపల్ కమిషనర్ రాముడు ఆదేశించారు. గురువారం నక్కలపల్లె సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ వద్ద జరుగుతున్న లీకేజీ మరమ్మత్తు పనులను డీఈ చిదానందరెడ్డితో కలిసి కమిషనర్ పరిశీలించారు. ప్రజలకు తాగునీటి సమస్య ఎక్కువ రోజులు తలెత్తకుండా త్వరగా పనులు పూర్తిచేయాలన్నారు. విధుల్లో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి

లింగాల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజలు నివసిస్తున్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పులివెందుల సబ్ యూనిట్ అధికారి సద్దయ్య అన్నారు. లింగాల ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులకు సీజనల్ వ్యాధులు, మలేరియా, డెంగ్యూలపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రంలో ల్యాబ్ రికార్డులను పరిశీలించి వైద్య సిబ్బందితో మాట్లాడారు.

కమలాపురంలో రేపు జాబ్‌మేళా

కమలాపురం రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కమలాపురం వెలుగు కార్యాలయం వద్ద ఈ నెల 21న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు సాంబశివ, సుబ్బలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 21న శనివారం ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంటు కార్పొరేషన్ స్కిల్‌డెవలప్‌మెంటు అండ్ ట్రైనింగ్ డిపార్ట్‌మెంటు ఆఫ్ ఏపీ సౌజన్యంతో కమలాపురంలోని ఐకేపీ (వెలుగు) కార్యాలయంలో ఉద్యోగ మేళా ఉంటుందన్నారు. వివరాలకు సాంబశివ సెల్. 9966452542, సుబ్బలక్ష్మి 8309806158కు సంప్రదించవచ్చని తెలిపారు.

454 మంది కంటింజెంట్ వర్కర్ల కొనసాగింపు

● పలు డివిజన్లలో సీసీరోడ్ల నిర్మాణం
● స్టాండింగ్ కమిటీ సమావేశంలో సభ్యుల తీర్మానం



సమావేశంలో చర్చిస్తున్న మేయర్, కమిషనర్, సభ్యులు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ పరిధిలో 454 మంది కంటింజెంట్ వర్కర్లను కొనసాగించాలని స్టాండింగ్ కమిటీ సభ్యులు తీర్మానం చేశారు. పలు డివిజన్‌లలో సీసీరోడ్లు నిర్మాణం చేసేందుకు కడప కార్పొరేషన్ మేయర్ చాంబర్‌లో మేయర్ సురేష్ బాబు అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. 15 అంశాలతో కూడిన అజెండాను ప్రవేశపెట్టగా వాటిలో రెండు ప్రతిపాదనలను తిరస్కరంచి మిగతా 13 అంశాలను సభ్యులు ఆమోదించారు.41వ డివిజన్‌లో రూ.50లక్షలతో సీసీరోడ్డుకు ఆమోదం తెలిపారు. 7వ డివిజన్ శంకరాపురం ప్రాంతంలో సీసీరోడ్డు పనులకు ఆమోదం తెలిపారు. ముత్తరాజుపల్లెలోనజడ్పీ హైస్కూల్‌లో సీసీరోడ్డు ఆమోదం తెలిపారు. నగరపాలక సంస్థపరిధిలో ఏర్పాటుచేసిన గోశాలలో ఆవులు లేదా దూడలను ఎవరికైన రైతులకు కానీ దేవస్థా నం వారికి కానీ ఇచ్చినందుకు షరతులతో తీర్మానించారు. 12వ డివిజన్‌లో సీసీరోడ్డు పకీరుపల్లెకు వెళ్లే సీసీరోడ్డుకు ఆమోదం తెలిపారు. నగరపాలక సంస్థలో 454 మంద కంటింజెంట్ వర్కర్లను కొనసాగిస్తూ తీర్మానం చేశారు. కమిషనర్ మనోజ్‌రెడ్డి స్టాండింగ్ కమిటీ సభ్యులు 14 డివిజన్ కార్పొరేటర్ కె.బాబు, 28వ డివిజన్ కార్పొరేటర్ మక్బుల్ బాష, 40వ డివిజన్ కార్పొరేటర్ బాలస్వామిరెడ్డి, ఎస్ఈ చెన్నకేశవరెడ్డి, ఎంహెచ్ఓ చంద్రశేఖర్, సీపీ రమణ, ఈఈ నారాయణస్వామి, ధనలక్ష్మి, ఆర్ఓలు కన్నయ్య, విజయభాస్కర్‌గౌడ్, మేనేజర్ గుర్రప్ప పాల్గొన్నారు.

విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తే ఊరుకోం

● జేఏసీ నాయకుల ధ్వజం



కడప విద్యుత్ భవన్ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు, సిబ్బంది

కడప నాగరాజుపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తే ఊరుకోబోమని జేఏసీ నాయకులు ధ్వజమెత్తారు. రాష్ట్రంలో విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరణ చేసేందుకు యాజమాన్యం, ప్రభుత్వాలు చాప కిందనీరులా ప్రయత్నాలు చేస్తున్నాయని జేఏసీ నాయకులు ధ్వజమెత్తారు. గురువారం కడప విద్యుత్ భవన్ ఎదుట భోజన విరామ సమయంలో జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు బన్నబాస్, చలపతి, రామలింగారెడ్డి, స్ట్రగుల్ కమిటీ నాయకులు సుదర్శన్‌రెడ్డి, శివశంకర్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చండీగఢ్ మరియు ఉత్తరప్రదేశ్‌లో విద్యుత్ సంస్థలు ప్రైవేటీకరణ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు రద్దుచేయాలని, ఈనెల 6వ తేదీ నుంచి చండీగర్‌లో విద్యుత్ ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులతో కలిసి చేస్తున్న తీవ్రమైన ఆందోళనలకు మద్దతు తెలియజేస్తున్నట్లు తెలిపారు. అలాగే రాష్ట్రంలో అదాని కంపెనీ ద్వారా బిగిస్తున్న స్మార్ట్‌మీటర్ల వలన, విద్యుత్ వినియోగదారులకు మీటర్ రీడర్లకు, ఈఆర్వోలలో పనిచేస్తున్న సిబ్బందికి తీవ్ర నష్టం జరుగుతుందని తెలిపారు. నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఇంజనీర్ అండ్ ఎంప్లాయస్ పలుపుమేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వాళ్లు తెలిపారు. విద్యుత్ ఉద్యోగులకు రావాల్సిన రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలు వెంటనే విడుదల చేయాలన, విద్యుత్ సవరణల చట్టం 2022 ప్రతిపాదన విరమించుకోవాలని, కాంట్రాక్ట్ కార్మికులకు 2022 నుంచి అరియర్స్ చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, నూతనంగా ఏర్పడిన జిల్లాలకు కొత్త సిబ్బందిని ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు యాకూమ్, మురళి, రామచంద్రారెడ్డి, నాగేశారెడ్డి, సత్యనారాయణశర్మ, నాగసుబ్బయ్య, నాయబ్‌రసూల్, జయప్ప, రామకృష్ణ తదితరులు మరియు విద్యుత్ భవన్‌లోని ఉద్యోగులు మరియు ఇతర డివిజన్ నుంచి ఇచ్చిన విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

నష్టపరిహారంలో చేతివాటం.. రీ సర్వేకు డిమాండ్

కమలాపురం రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలోని రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణంలో నిర్వహించిన సర్వేలో అధికారుల నిర్లక్ష్యంతో నష్టపోతున్నామని బాధితులు 13వ వార్డు కౌన్సిలరు బాబుల్ గౌస్‌బాషా పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కమలాపురం ఫ్లైఓవరుకు సంబంధించి జరిగిన సర్వేలో వ్యత్యాసం ఉందని, అనుకూలంగా ఉన్న వారికి మాత్రమే అధిక శాతం నష్టపరిహారం వచ్చేలా చేశారన్నారు. రైల్వే గేటు సమీపంలో దుకాణాల ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నామని, ఫ్లైఓవరు నిర్మాణంలో మా రూములన్నీ కోల్పోవడంతో జీవనోపాధి లేకుండాపోతుందని తెలిపారు. అధికారులు కొలతల్లో వ్యత్యాసం వేశారన్నారు. తిరిగి కొలతలు వేసి నష్టపరిహారం ఇప్పించాలన్నారు.

భూ సమస్యలు 45 రోజుల్లోగా పరిష్కరించుకోండి

● తహసీల్దారు సరస్వతి



రైతులు ఇచ్చిన అర్జీలను పరిశీలిస్తున్న తహసీల్దారు సరస్వతి

చెన్నూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యలు 45 రోజుల్లోగా పరిష్కరించుకోవాలని తహసీల్దారు సరస్వతి అన్నారు. మండలంలోని చిన్నమాచుపల్లె గ్రామ సచివాలయంల గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ గ్రామానికి చెందిన రైతులు 23 మంది తమ భూములకు సంబంధించి సమస్యలు అర్జీల రూపంలో తహసీల్దారుకు అందించారు. వాటిని ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామన్నారు.

రాష్ట్ర ఖజానా ఉద్యోగ సంఘం అధ్యక్షుడిగా గోవింద రవికుమార్

కడప కలెక్టరేట్, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఖజానా శాఖ ఉద్యోగ సంఘం అధ్యక్షుడిగా 5వ మారు కడప ఉప ఖజానా శాఖ అధికారి గోవింద రవికుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈనెల 15న తిరుపతిలోని రెడ్డిభవన్‌లో జరిగిన సమావేశంలో అన్ని జిల్లాల సంఘ నాయకులు పాల్గొని ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈయన 2011లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.



స్వాతంత్ర్య పోరులో అశువులు బాసిన వీరుడు అష్ఫాఖుల్లా ఖాన్

కడప కల్చరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో నాటి బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా పోరు సాగించి 27 ఏళ్ల ప్రాయంలోనే అశువులు బాసిన వీరుడు అష్ఫాఖుల్లా ఖాన్ అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమీర్‌బాబు కొనియాడారు. అష్ఫాఖుల్లా ఖాన్ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం స్థానిక కో-ఆపరేటివ్‌కాలనీలో గల అమీర్‌బాబు కార్యాలయంలో నిర్వహించిన వేడుకలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అష్ఫాఖుల్లాఖాన్ అసమాన దేశభక్తుడు

కడప సెవెన్‌రోడ్స్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): భారత దేశ స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో కోట్లాది ముస్లింలలో మొట్టమొదటిగా ఉరికంబాన్ని సైతం ముద్దాడి తన మెడలో తానే వేసుకున్న అష్ఫాఖుల్లాఖాన్ అసమాన దేశభక్తుడని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర కొనియాడారు. గురువారం స్థానిక హోచిమన్ భవన్ నందు ఇన్సాఫ్ ఆధ్వర్యంలో అష్ఫాఖుల్లాఖాన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు సుబ్బారెడ్డి, చంద్రశేఖర్, ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షులు కేసీ బాదుల్లా, డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి కె.మునయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉరికంభాన్ని ముద్దాడిన వీరులను మరువలేం

పులివెందుల రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యం కోసం ఉరికంభాన్ని ముద్దాడిన వీరులని మరువలేమని జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బండి సుధాకర్‌రెడ్డి కొనియాడారు. గురువారం ఇస్లాంపురం జడ్పీ ఉర్దూ ఉన్నత పాఠశాలలో స్వాతంత్ర్య సమరయోధులు పండిత్ రామ్‌ప్రసాద్ బిస్మిల్, అష్ఫాకుల్లా ఖాన్, రోషన్‌సింగ్‌ల వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించారు.





కడపలో అష్ఫాఖుల్లా ఖాన్ వర్ధంతి వేడుకలో మాట్లాడుతున్న అమీర్‌బాబు... నివాళులర్పిస్తున్న గాలి చంద్ర

నిత్యావసర సరుకుల వితరణ

కడప నాగరాజుపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సిలిండర్ పేలుడుతో ఆస్తినష్టం జరిగిన కుటుంబానికి గురువారం 28వ డివిజన్ టీడీపీ నేత బి.అబ్దుల్లాబుచర్ నిత్యాసర సరుకులు అందించారు. బుధవారం రాత్రి రవీంద్రనగర్‌లోని మసీద్ వద్ద సిలిండర్ పేలుడుతో నష్టపోయిన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సేవకు టీడీపీ సిద్ధంగా ఉందన్నారు.

శిక్షణను వినియోగించుకోండి

పెండ్లిమర్రి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఏపీడీ సూచించారు. గురువారం కొత్తపేటలోని క్యాటిల్‌షెడ్‌లో ఎనిమిది మండలాల ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందికి ఏపీడీ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.



న్యాయవాదుల నిరసనకు అఫ్జల్‌ఖాన్ సంఘీభావం

కడప కలెక్టరేట్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): కడపలో డీపీఎస్ కోర్టును ఏర్పాటు చేయాలని కడప జిల్లా కోర్టు వద్ద న్యాయవాదులు చేస్తున్న పోరాటానికి కడప కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు అఫ్జల్‌ఖాన్ గురువారం పాల్గొని తమ సంపూర్ణమద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా అఫ్జల్‌ఖాన్ మాట్లాడుతూ న్యాయవాదుల పోరాటానికి కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రదాన కార్యదర్శిమహమ్మద్ అలీఖాన్,రహమతుల్లాఖాన్, హమీద్,దినకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్థూప ఆవిష్కరణ, బహిరంగ సభను జయప్రదం చేయండి

● ఆర్సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి

కడప సెవెన్ రోడ్స్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకుడు కామ్రేడ్ లింగమూర్తి స్మారక స్థూపాన్ని ఈనెల 28న ఆవిష్కరిస్తామని, స్థానిక కమ్యూనిస్టు పార్టీ నాయకులు, వివిధ పార్టీల, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు, పెద్దఎత్తున హాజరుకావాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి కోరారు. గురువారం లింగమూర్తి స్థూపం పనులను రవిశంకర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థూపం ఆవిష్కరణ కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ రామకృష్ణ, సీనియర్ రాజకీయ వేత్త, మాజీ హోం మంత్రి ఎంవీ మైసూరారెడ్డి, సీపీఎం సీనియర్ నాయకులు, మాజీ ఎంపీ పెనుమల్లి మధు, ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు లక్ష్మీనారాయణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు హాజరుకానున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, సుబ్బరాయుడు, డీజీహెచ్‌పీఎస్ జిల్లా గౌరవాధ్యక్షులు వెంకటేష్, రైతు నాయకులు మునిరెడ్డి, ఆర్టీయు నాయకులు గంగన్న, విజయ్‌కుమార్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు అధిక ప్రాధాన్యత హర్షణీయం

కడప స్పోర్ట్స్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం హర్షణీయమని జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి అన్నారు. 2 శాతాన్ని 3 శాతానికి పెంచి క్రీడాకారులకు చేయూత నందిస్తున్న తీరు పట్ల సంతోషం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక సంఘం జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సామావేశంలో ఆయన మాట్లాడారు. క్రీడావిభాగంలో ప్రతిభ కనబరచిన వారికి 3 శాతం రిజర్వేషన్ కోటా గ్రూప్-2 కేటగిరి ఉద్యోగాల వరకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. అంతేకాకుండా క్రీడలను ప్రోత్సహించేలా ఉందని పేర్కొన్నారు.

పంటల బీమా గడువు పెంపు

కమలాపురం రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు ఈ నెల 31వ తేదీ లోపు బీమా చేసుకోవచ్చని వ్యవసాయ సహాయ సంచాలకులు ఏవీ నరసింహారెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కమలాపురం వ్యవసాయ డివిజన్ పరిధిలోని కమలాపురం, వల్లూరు, వీరపునాయునిపల్లె, ఎర్రగుంట్ల మండలాల్లోని రెవెన్యూ గ్రామాలకు సంబంధించిన రైతులకు రబీలో సాగు చేసిన పంటలకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద పంటలకు ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించాలని తెలిపారు. వాతావరణం ఆధారిత పంటలకు ఇఫ్కో కంపెనీ ప్రీమియం చెల్లించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. శనగ పంటను గ్రామ యూనిట్ కింద పరిగణిస్తారని, అలాగే వేరుశనగ, జొన్న, ప్రొద్దుతిరుగుడు, నువ్వు, వరి, మినుము, మొక్కజొన్న పంటలకు మండల యూనిట్ కింద పరిగణిస్తారని పేర్కొన్నారు. అలాగే ఉల్లి, పెసర పంటలను జిల్లా యూనిట్ కింద పరిగణిస్తారన్నారు.
బ్యాంకు రుణం పొందినప్పుడు తప్పనిసరిగా పంటల బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. మధ్యవర్తులను, దళారులను నమ్మవద్దని సూచించారు. పూర్తి వివరాలకు ఆయా గ్రామాల ఆర్ఎస్‌కే సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు.

అభివృద్ధిపై సీఎంతో మాట్లాడిన ఎమ్మెల్యే



చంద్రబాబుతో మాట్లాడుతున్న పుట్టా

మైదుకూరు రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ కోరారు. గురువారం విజయవాడలోని సెక్రటేరియట్‌లో పుట్టా సుధాకర్ యాదవ్ సీఎంను కలిశారు. నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులు, సమస్యలపై మాట్లాడారు. అందుకు సీఎం సానుకూలంగా స్పందించినట్లు పుట్టా తెలిపారు.

మంత్రి నిమ్మలను కలిసిన భూపేశ్‌రెడ్డి



మంత్రి నిమ్మలకు వినతిపత్రం ఇస్తున్న భూపేశ్‌రెడ్డి

కొండాపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామనాయుడును గురువారం జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి కలిశారు. విజయవాడలోని మంత్రి చాంబర్‌లో కలిసి నియోజకవర్గ సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా ప్రధాన సమస్యలైన గండికోట ప్రాజెక్టు నిర్వాసితుల ముంపు పరిహారం, రాజోలి సమస్యలపైన చర్చించినట్లు తెలుస్తోంది. వీటితో పాటు నియోజకవర్గంలోని పలు సమస్యలపై మంత్రికి వినతిపత్రం అందజేశారు. టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ఆయాలకు జీతాలు చెల్లింపు

ఆంధ్రజ్యోతి స్పాట్

ఎర్రగుంట్ల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆరు నెలులుగా జీతాలు రాక బతుకు భారమై అప్పు చేసి జీవనం సాగిస్తున్న ఆయాలకు ప్రభుత్వం ఎట్టకేలకు మూడు నెలల వేతనాలను చెల్లించింది. 'ఆరు నెలలుగా జీతాలు రాక...కుదేలవుతున్న జీవితాలు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమైన కథనంపై స్పందించిన ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆయాలకు మూడు నెలల జీతాలు వేసినట్లు బాధితులు తెలిపారు. ఇంటి అద్దె, కొంత కిరాణా అప్పు కట్టుకున్నామని, వడ్డీలకు తెచ్చుకున్న అప్పు అలాగే మిగిలి వుందని, మిగతా జీతాలు కూడా వేస్తే సంతోషిస్తామని ఆయాలు పేర్కొంటున్నారు.

'దళితులకు భూ పంపిణీ అమలు చేయాలి'

పోరుమామిళ్ల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అక్కలరెడ్డిపల్లె దళితులకు భూపంపిణీ అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్ డిమాండ్ చేశారు. గురువారం అక్కలరెడ్డిపల్లెలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో వారు తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. రెవెన్యూ గ్రామం సర్వేనెం.1854 ప్రభుత్వ భూముల్లో పేదలు సాగు చేస్తున్న వారికి పట్టాలు మంజూరు చేయాలని కోరారు. 1987లో అప్పటి మంత్రి వీరారెడ్డి 60 కుటుంబాలకు మూడు సెంట్ల వంతున ఇళ్లస్థలాలు పంపిణీ చేశారని, ఆ స్థలాలు వారికి కొలతలు వేసి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘం నేతలు, అక్కలరెడ్డిపల్లె సర్పంచ్ రాయపాటి గోపాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

కార్గో హోం డెలివరీని సద్వినియోగం చేసుకోండి

బద్వేలు రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వ్యాపారులు, ఉద్యోగులు, ప్రయాణికులు, అన్నివర్గాల వారు ఆర్టీసీ కార్గో రవాణా విభాగాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ డిపో మేనేజర్ కన్యాకుమారి కోరారు. నేటి నుంచి కార్గో రవాణా విభాగం డోర్ డెలివరీని ప్రారంభిస్తున్నామని, చిన్నకవర్ నుంచి 50కిలోల బరువుగల పార్శిల్ 10 కిలోమీటర్ల పరిధిలోపు డోర్‌డెలివరీ చేస్తామన్నారు. ప్రతి పార్శిల్‌కు పూర్తిభరోసా ఉంటుందని ఆమె తెలిపారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గపరిధిలోని అన్నివర్గాల వారు సద్వినియోగం చేసుకోవాలని గురువారం ఆమె ఒక ప్రకటనలో కోరారు.

భూసమస్యల పరిష్కారమే ధ్యేయం

రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి : ఆర్డీఓ



పెద్దముడియం- పెద్దపసుపుల సదస్సులో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ - భూసమస్యలపై అర్జీలు ఇస్తున్న బాధిత రైతులు

పెద్దముడియం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సుల ధ్యేయమని ఆర్డీఓ సాయిశ్రీ అన్నారు. పెద్దపసుపులలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆర్డీఓ అధికారులతో మాట్లాడుతూ రైతుల నుంచి వచ్చే ప్రతి ఒక్క అర్జీకి సమాధానం చెప్పాలని వారి సమస్యలను అర్జీల రూపంలో స్వీకరించి ప్రతి ఒక్కటీ క్షుణ్ణంగా పరిశీలించి లబ్ధిదారులకు న్యాయం చేయాలని సూచించారు. రైతులు ఎదుర్కొంటున్న భూసమస్యలకు పరిష్కారం చూపాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని అధికారులకు తెలిపారు. రైతుల నుంచి ఏ ఏ సమస్యలు వచ్చాయని వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలువురు రైతులు తమ సమస్యలను ఆర్డీఓ దృష్టికి తెచ్చారు. ఏళ్ల తరబడి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగినా సమస్యలు పరిష్కారం కావడం లేదని అధికారులు పట్టించుకోవడం లేదని వివరించారు. ఆర్డీఓ మాట్లాడుతూ ఇలాంటి సమస్యలు పరిష్కరించడమే రెవెన్యూ సదస్సుల ఉద్దేశమన్నారు. సమస్యలున్న ప్రతి ఒక్కరూ అర్జీలను అధికారులకు అందిస్తే వాటికి తప్పకుండా పరిష్కారం చూపిస్తామని మండల స్థాయిలో తహసీల్దారు పరిధిలో సమస్యలు పరిష్కారం అవుతాయని అక్కడ కాకపోతే తన దృష్టికి తీసుకురావచ్చని ఆర్డీఓ ప్రజలకు సూచించారు. తహసీల్దారు బాల నరసింహులు, రెవెన్యూ అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

వినతుల వెల్లువ...

అట్లూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇప్పటి వరకు నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఆన్‌లైన్ భూ సమస్యలే ఎక్కువగా రైతుల నుంచి వినతిపత్రాలు వచ్చినట్లు తహసీల్దారు సుబ్బలక్షుమ్మ తెలిపారు. మాడపూరులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆన్‌లైన్ భూ సమస్యలు, పట్టాదారు భూములు భాగపరిష్కారాలు, ఆన్‌లైన్ నమోదు కోసం రైతుల నుంచి ఎక్కువగా వినతి పత్రాలు వచ్చాయన్నారు. వచ్చిన సమస్యలకు రశీదులు ఇచ్చామన్నారు. సదస్సుల అనంతరం రైతు సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారం చూపుతామన్నారు. మండల ఇన్‌చార్జ్ రెడ్డయ్య, సర్వేయరు వేణుగోపాల్, ఆర్‌ఐ రమణ, వీఆర్వో దస్తగిరి, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

దువ్వూరులో...

దువ్వూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దువ్వూరులో అధికారులు గురువారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. రైతులు తమ పొలాలకు సంబంధించిన పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ప్రధానంగా భూములు ఆన్‌లైన్ చేయాలని, సర్వే చేసి పొలాల సరిహద్దులు నిర్ణయించాలని, రైతుల మధ్య వారి పొలాలకు సంబంధించి హద్దులు నిర్ణయించాలనే సమస్యలను అధికారుల దృష్టికి తెస్తూ వినతులు అందచేశారు. సదస్సులో తహసీల్దార్ అక్బర్‌బాష, డీటీ వేణుగోపాల్, ఆర్‌ఐ జాన్సన్, సర్వేయర్ పద్మావతి వీఆర్‌ఓల పర్యవేక్షణలో జరిగింది.

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

బ్రహ్మంగారిమఠం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి అన్నారు. గురువారం డి.అగ్రహారంలో టీడీపీ నేత కానాల మల్లికార్జునరెడ్డి పర్యవేక్షణలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దారు దామోదర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్లు జాన్సన్, సాంబశివారెడ్డి, టీడీపీ నేతలు కానాల మల్లికార్జునరెడ్డి, ఎల్లటూరు సాంబశివారెడ్డి, యత్తపు ఈశ్వర్‌రెడ్డి, మేకల సుధాకర్, శివ, బసిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, లగసాని గంగరాజు, ముద్దుక్రిష్ణమనాయుడు, భగీరథ పాల్గొన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలు అంబేడ్కర్‌ను అవమానించడమే

నిరసన తెలిపిన దళిత, ప్రజాసంఘ నేతలు



బద్వేలులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న దళిత ప్రజాసంఘాల నేతలు

పోరుమామిళ్ల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోం మంత్రి చేసిన వ్యాఖ్యలు అంబేడ్కర్‌ను అవమానించడమేనని పోరుమామిళ్ల అంబేడ్కర్ సేన ఆర్గనైజింగ్ కార్యదర్శి ముత్యాల ప్రసాదరావు, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. అమిత్‌షా చేసిన వ్యాఖ్యలపై అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం నిరసన తెలిపిన దళిత సంఘాలు మాట్లాడుతూ అంబేడ్కర్ పేరు జపించే బదులు దేవున్ని స్మరించుకుంటే ఏడుజన్మల దాకా స్వర్గప్రాప్తి కలుగుతుందని అనడం ఆయనను అవమానించడమేనని, దేశ పౌరులు క్షమించరన్నారు. అంబేడ్కర్ పాదాలు కడిగి అమిత్‌షా నెత్తిన చల్లుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మూడు పర్యాయాలు కేంద్ర హోంమంత్రిగా బాధ్యతలు నిర్వహించగానే రాజ్యాంగ విలువలు మరిచారన్నారు. ఆయనపై చేసిన వ్యాఖ్యలకు దేశ పౌరులు తగిన గుణపాఠం చెబుతారన్నారు. కిరణ్, నాగరాజు, ఇళ్ల చరణ్, చినరాయుడు పాల్గొన్నారు.

ప్రజా సంఘాల నిరసన

బద్వేలు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ అంబేడ్కర్‌పై పార్లమెంటులో హోం మినిష్టర్ అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ గురువారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. దళిత సంఘం, ప్రజాసంఘాల నేత ఓఎస్‌వీప్రసాద్ మాట్లాడుతూ హోంమంత్రి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నేతలు పిచ్చయ్య, వెంకటసుబ్బయ్య, నరసయ్య , ప్రసాద్, తిరుపాల్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు, లైసెన్సులు లేని వాహనదారులకు జరిమానా



జరిమానా వేస్తున్న ఎస్‌ఐ రామక్రిష్ణ

అట్లూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వాహన రికార్డులు, లైసెన్సులు లేని తొమ్మిది వాహనాలకు రూ.3700 జరిమానా వేసినట్లు ఎస్‌ఐ రామక్రిష్ణ తెలిపారు. గురువారం సాయంత్రం పోలీసుస్టేషన్ ఎదుట ప్రధాన రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. హెల్మెట్, లైసెన్సు, వాహన రికార్డులు లేని వారికి జరిమానా వేశామన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వాహనదారులకు సూచించారు.

అమృత్ సరోవర్ పనుల్లో సిద్దవరం చెరువు చేర్చాలి

పోరుమామిళ్ల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అమృత్‌సరోవర్ పనుల్లో సిద్దవరం చెరువును చేర్చాలని సిద్దవరం నీటి యాజమాన్య అధ్యక్షురాలు గిరజమ్మ అధికారులకు విజ్ఞప్తి చేశారు. చెరువులను బలోపేతం చేయాలని ఎన్‌డీఏ ప్రభుత్వం నిర్ణయించింది. నీటి నిల్వ సామర్థ్యం ఉండేలా పూడికతీత పనులు, కట్టలను పటిష్టం చేసి కంపచెట్ల తొలగించాలని పంచాయతీకి ఒక చెరువు ఎంపిక చేయాలని నీటి యాజమాన్య సంస్థ అధికారులు ఆదేశించారు. సిద్దవరం చెరువు కంపచెట్లతో నిండి కట్టకూడా పటిష్టంగా లేదని ఈ చెరువును రెండో విడత అమృత్ సరోవర్‌లో చేర్చాలని కోరారు. తెలుగుంగ పెద్ద కాల్వ తమ గ్రామం నుంచీ పోతున్నా చెరువు పైభాగాన ఉన్నందున నీళ్ల రావడం లేదని, లిఫ్టు ద్వారా సిద్దవరం, చిన్నాయపల్లె చెరువులు నింపాలని ఆమె కోరారు.

CITATION
IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE AT CHINCHOLI
OS No.117/2023

1) Veeramani w/o Pratap Reddy age: 60 years, Occupation: agriculture & house hold R/o Antawaram Village of Taluka Tandur District: Vikarabad (T.S.).
2) Vasanta W/o Rajendra Reddy age 57 years Occupation: agriculture & household R/o Meetabaspally village of District : Vikarabad (T.S)
3) Laxmi W/o Maipal Reddy age:54 years Occupation: household & agriculture R/o Gousebad Taluka, Zaheerabad District : Sangareddy (T.S). ....Plaintiffs

VERSUS

1) Bichamma W/o Jaipal Reddy, age: 70 years, Occupation: Agriculture & household R/o Fathepur Village of Taluka Chincholi District: Kalaburgi.
2) Narmada W/o Ravindra Reddy, age: 48 years, Occupation: Agriculture & household R/o Bopunaram village of Mandal Bantawaram District: Vikarabad (T.S).
3) Sapna W/o Siddharth Reddy, Age: 45 years, Occupation: Agriculture & household R/o Rangasamudram Taluka Pormadi District Kadapa (A.P).
4) Shobha Rani W/o Pratap Reddy age: 40 years, Occupation: Agriculture & household R/o Khatak Chincholi Taluka Bhalki District : Bidar.
5) Kavita W/o Venkat Reddy age: 45 years, Occupation: Agriculture & household R/o Fathepur village of Taluka Chincholi District Kalaburgi.
6) Bhanu Kiran S/o Venkat Reddy Age: 25 years, Occupation: Agriculture R/o Fathenagar village of Taluka Chincholi District: Kalaburgi.
7) Keerthi D/o Late Venkat Reddy age: 23 years, Occupation: Agriculture & household R/o Fathepur village of Taluka Chincholi District: Kalaburgi. ...Defendants

To,
3) Sapna W/o Siddharth Reddy, Age: 45 years, Occupation: Agriculture & household R/o Rangasamudram Taluka Pormadi District Kadapa (A.P)

Whereas the above named plaintiff has instituted against the defendant for suit for partition and separate possession and correction of revenue records against the defendants That the summons/notices and RPAD were issued returned of Defendant No.3 un served as you are intentionally avoiding to receive the same. Hence you are hereby directed to appear in this court in person or by pleader duly instructed to answer all materials questions, relating to the case or accompanied by som person able to answer in the above matter on 08.01.2025 at 11.00 AM failing which the matter will be determined according to law.

Take notice that in default of your appearance on the day mentioned above the case will heard and decided in your absence.

Given under my hand and the seal of this court the 27th day of Nov 2024.

Through S.A.Reddy Advocate, Chincholi

By order of the court Sd/-Chief Ministerial Officer Senior civil Judge Court Chincholi-585 307

వేడుకగా హిందూ, ముస్లిం ఐక్యతా దినోత్సవం



నివాళులర్పిస్తున్న హిందూ, ముస్లింలు

బద్వేలు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక సిద్దవటం రోడ్డులోని మసీదు కాంప్లెక్స్ వద్ద స్వతంత్ర సమరయోధులు రాంప్రసాద్, అష్ఫఖ్ కుల్లాఖాన్‌కు ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ప్రజాసంఘాల నేతలు మాట్లాడుతూ భారతదేశాన్ని బ్రిటీషు పాలకుల కబంద హస్తాల నుంచి విముక్తి కలిగించాలని, హిందుస్తాన్ పబ్లికేషన్ సంస్థల ద్వారా భారతీయులను ఉత్తేజితులను చేశారని, మాతృభూమి విముక్తి పోరాటంలో చివరికి వారు ఉరిశిక్షలను కూడా స్వీకరించి చిరస్మరణీయులయ్యారన్నారు. వారి వర్ధంతిని పురస్కరించుకుని హిందూ ముస్లిం ఐక్యతా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాష, పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నానబాల వెంకటేశ్వర్లు, వైవీయూ పాలక మండలి సభ్యుడు కె.చిన్నసుబ్బారావు, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ మహబూబ్ బాష తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో....

పోరుమామిళ్ల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): భగత్‌సింగ్‌కే అష్ఫఖుల్లాఖాన్ స్ఫూర్తినిచ్చారని ఆవాజ్ మండల మహిళా నాయకురాలు గౌసియాబేగం, మండల కార్యదర్శి షరీఫ్ అన్నారు. అంబేడ్కర్ భవన్‌లో అష్ఫఖుల్లాఖాన్ వర్ధంతి నిర్వహించారు. ఆవాజ్ నేతలు మాబు, గౌసియాబేగం, చిన్నయ్య, వరలక్ష్మి, నారాయణ పాల్గొన్నారు.

శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టిపెట్టండి : డీఎస్పీ



నర్సాపురం పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ రాజేంద్రప్రసాద్

కాశినాయన డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): మండలంలో శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం తలెత్తకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని మైదుకూరు డీఎస్పీ జి.రాజేంద్రప్రసాద్ ఎస్‌ఐ హనుమంతుకు సూచించారు. గురువారం నర్సాపురం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఆయన మాట్లాడుతూ విధినిర్వహణలో సిబ్బంది నిక్కచ్చిగా ఉండాలన్నారు. గ్రామాల్లో పర్యటిస్తూ క్షేత్రస్థాయిలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం లేకుండా చూడాలన్నారు. మండలంలో విశాలమైన ఎస్టేట్స్ కనిపిస్తున్నాయని వాటిలో జరుగుతున్న కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా పెట్టాలంటూ సిబ్బందికి సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం స్టేషన్ రికార్డులను పరిశీలించి కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు, ఏఎస్‌ఐ రమణ ఇతర పోలీసులు పాల్గొన్నారు.

'బలిజలు ఐక్యంగా ఉండాలి'



సమావేశంలో మాట్లాడుతున్న హరిప్రసాద్

ఎర్రగుంట్ల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా బలిజలు ఐక్యంగా ఉండాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం రాత్రి స్థానిక కడప రోడ్డులోని బలిజ సంఘం కార్యాలయంలో ఎర్రగుంట్ల మండల బలిజ నేతలతో సమావేశమై బలిజ, కాపు, తెలగ ఆత్మీయ సన్నాహక సమావేశంపై ఆయన మాట్లాడుతూ బలిజలంతా ఐక్యంగా ఉండి మంత్రులు, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులను సన్మానించుకోవాలన్నారు.

ఈమేరకు 22న ఆదివారం బలిజల ఐక్యత కోసం కడపలో జరిగే కార్యక్రమంలో కాపు మంత్రులు, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలను సన్మానిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు బలిజలందరూ భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో బలిజ సంఘం మండల అధ్యక్షుడు ఎస్.చలపతి, మాజీ జడ్పీటీసీ బట్టరు శెట్టి శ్రీనివాసులు, జి.మధుసూదన్, ఎల్.రవి, వై.వెంకటేష్, జి.సుదర్శన్, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

శనగపంట తొలగింపు

ప్రత్యామ్నాయ పంట కోసం సిద్ధం



శనగపంటను పీకుతున్న కూలీలు

రాజుపాలెం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గత తుపానుకు శనగ పంట పూర్తిగా దెబ్బతినడం, ఎర్రగా పోవడంతో రైతన్నలు పురుగుమందు పిచికారీ చేసినా ఫలితం లేదని తెలియడంతో చేసేదేమీ లేక పంట తొలగింపునకు సిద్ధమయ్యారు. అధికంగా వర్షాలు పడుతుండడంతో పంట పండదని నమ్మకంతో ఈ పంట తొలగిస్తున్నట్లు వారు తెలిపారు. మండలంలోని తొండలదిన్నె, వెలవలి పొలాల్లో దాదాపు 50 ఎకరాలు శనగపంట పొలం వర్షం ధాటికి పంట పూర్తిగా ఎర్రబారడం, పంట పండే స్థితిలో లేకపోవడంతో ప్రత్యామ్నాయ పంట కోసం రైతన్నలు 50 రోజుల శనగపంటను తొలగిస్తున్నారు. పంట పొలానికి ఎకరాకు 15వేల రూపాయలు కౌలు, సేద్యం, విత్తనం మందు పిచికారీకి దాదాపు రూ.35వేలు ఖర్చు వచ్చిందని, అయితే ఇక పండదని తెలియడంతో ఈ పంట తొలగిస్తున్నట్లు తెలిపారు. తమను ఉన్నతాధికారులు గుర్తించి పంట నష్టానికి ప్రభుత్వం ద్వారా సహాయం చేయడం, ప్రత్యామ్నాయ పంటలు ఏర్పాటుకు వంద శాతం సబ్సిడీతో విత్తనాలు మంజూరు చేయాలని రైతులు తెలిపారు.

క్రీడలతో శారీరక మానసిక ఆరోగ్యం

ప్రొద్దుటూరు టౌన్ డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): క్రీడలు శారీరక మానసిక ఆరోగ్యానికి దోహదపడతాయని వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జయరామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో కడప రీజనల్ స్థాయి 27వ ఇంటర్ పాలిటెక్నిక్ బాలుర క్రీడా పోటీలు ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు వుంటుందన్నారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జింకా అశోక్‌బాబు మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు విద్య, ఉద్యోగాల్లో ప్రాధాన్యత కల్పిస్తారన్నారు. ఈ పోటీల్లో 15 పాలిటెక్నిక్ కళాశాలల క్రీడాకారులు పాల్గొన్నారు. చెస్ కబడ్డీ, వాలీబాల్, టేబుల్ టెన్నిస్, బాల్ బ్యాడ్మింటన్ అథ్లెటిక్స్ విభాగాల్లో పోటీ నిర్వహించారు. ఆర్‌జేడీ కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ వెంకట సుబ్బయ్య, రాయలసీమ వ్యాయామ విద్యాకళాశాల ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి ఈఈఈ హెచ్‌ఓడీ మంజునాథ్ అధ్యాపకులు పాల్గొన్నారు.

ఖాళీ పోస్టులు ఇన్‌చార్జ్‌ల పరం

- పారిశుధ్యం, ఇంజనీర్లు, టీపీఓలు, జేఏఓ, ఆర్‌ఐ లేకుండానే పరిపాలన
- సచివాలయ సిబ్బందే ఇన్‌చార్జ్‌లు
- అన్నింటికీ కమిషనరే స్పందిస్తున్న వైనం

ఎర్రగుంట్ల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల నగర పంచాయతీ ఇన్‌చార్జ్ లతోనే పరిపాలన సాగుతోంది. ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అభివృద్ధి పరుగులు పెట్టించాలన్న ధ్యేయానికి బ్రేక్ పడుతోంది. ప్రతి విషయంలోనూ సరైన స్పందన కరువౌతోంది. ప్రధాన పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. ముగ్గురు ఇంజనీర్లకు కేవలం ఒకరే ఉన్నారు. ఆయన కూడా కమలాపురానికి ఇన్‌చార్జిగా ఉంటూ ఇక్కడ మూడు రోజులు మాత్రమే పనిచేస్తున్నారు. ఎన్విరాన్‌మెంట్ ఏఈ పోస్టు రెండేళ్లుగా ఖాళీగానే ఉంది. పారిశుధ్యం ఇన్‌స్పెక్టర్ మధుకుమార్ జమ్మలమడుగుకు బదిలీ అయ్యారు. ఇక్కడికి ఎవరికీ పోస్టింగ్ ఇవ్వలేదు. దీంతో పారిశుధ్యం మొత్తం సచివాలయ సిబ్బందికే ఇన్‌చార్జులుగా ఇచ్చారు. ఎప్పటి నుంచో ఇక్కడ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పోస్టు ఖాళీగా వుంది. బకాయిల వసూళ్లు, కొత్త పన్నులు వేయడంలో పూర్తిగా వెనకబడినట్లు సమాచారం. ఇక్కడా సచివాలయ సిబ్బంది సహకారారే అవసరం. కీలకమైన టౌన్ ప్లానింగ్ సెక్షన్‌లో టీపీఓ, టీపీఎస్, టీపీబీఎస్ పోస్టులు చాలా కాలంగా ఖాళీగానే ఉన్నాయి. దీంతో ఇక్కడ తీవ్ర జాప్యం జరుగుతోంది. ఎక్కడ ఆక్రమణలు తొలగించాలన్నా, మార్కింగులు ఇవ్వాలన్నా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇక్కడా సచివాలయ సిబ్బందే దిక్కు. ఎక్కడ సమస్య వచ్చినా కమిషనరే పరుగులు పెడుతున్నారు. అకౌంట్ సెక్షన్‌లో జేఏఓ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులున్నాయి.

ఉన్నవారిలో అంతా మహిళలే....

ముగ్గురు సీనియర్ అసిస్టెంట్లు, నలుగురు జూనియర్ అసిస్టెంట్లలో ఆరుగురు మహిళలే. అందులో ఒకరు మెటర్నిటీ సెలవుపై వెళ్లారు. వీరు ఇతర ప్రాంతాల నుంచి విధులకు వస్తున్నారు.

ప్రధాన అధికారులు లేకపోవడంతో మొత్తం సచివాలయ సిబ్బందిని తాత్కాలిక ఇన్‌చార్జులుగా నియమించి పనులు చేయిస్తున్నట్లు కమిషనర్ శేషఫణి తెలిపారు. అన్నీ తానై పనిచేస్తుండడంతో చాలా పనులు కుంటుపడుతున్నాయన్నారు. మూడు నెలల్లో రూ.3 కోట్ల పనులు నిర్వహించేందుకు టెండర్లు పిలిచాము.